సాక్షి
తూర్పుగోదావరి

శనివారం । 18 । మార్చి । 2023



నూకాలమ్మకు వెండి గాజులు


పెద్దాపురం: కాండ్రకోట నూకాలమ్మకు కాకినాడకు చెందిన గంటా రామకృష్ణ, మల్లిపూడి లక్ష్మణమూర్తి కుటుంబసభ్యులు రెండు కేజీల వెండి గాజులను సమర్పించారు.



మరో తిరుపతిలా అన్నవరం

అన్నవరం క్షేత్రం భవిష్యత్తులో మరో తిరుపతిలా అభివృద్ధి చెందుతుందని, కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి అన్నారు. - IIలో▸

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 2,170, మధ్య డెల్టాకు 1,410, పశ్చిమ డెల్టాకు 3,450 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 5.20 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

నేడు లోక్ అదాలత్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి జిల్లాలోని రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం. పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగలలో శనివారం స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి తెలిపారు. కోర్టుల్లో పెండింగ్ ఉన్న కుటుంబ తగాదాలు, వినియోగదారుల కేసులు, పాక్షిక న్యాయ అధికార సంస్థల్లో పెండింగ్‌లో ఉన్న మేధో సంపత్తి హక్కుల కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరిస్తామన్నారు. ఉదయం 10 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

20న మినీ జాబ్‌మేళా

రాజానగరం/రాజమహేంద్రవరం రూరల్: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 20న రాజానగరం మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నారు. 19 ఏళ్ల నుంచి 29 ఏళ్ల వయసుఉండి, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్, మెకానికల్, బీటెక్ ఉత్తీర్ణులైన యువత అర్హులు. ఈ మేరకు జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.హరీష్ చంద్రప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎం.కొండలరావు, జేడీఎం కేశవరావు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. వరుణ్ మోటార్స్, ఇండియన్ డెయిరీ ఎక్విప్‌మెంట్ అండ్ ఫ్యాబ్రికేటర్స్ కంపెనీలు తమకు కావాల్సిన అభ్యర్థులను ఎంపిక చేసుకుంటాయని, విద్యార్హత, అనుభవాలను బట్టి నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకూ వేతనాలు ఉంటాయన్నారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు ఎఫ్ఏఎఫ్ఎస్‌డబ్ల్యూలో రిజిస్టర్ అయి దరఖాస్తు చేసుకోవచ్చని, లేదా ఆరోజు నేరుగా ఇంటర్వ్యూలకు కావొచ్చన్నారు. ఇతర వివరాలకు 89198 68419, 95818 10049 నంబర్లను సంప్రదించాలి.

క్రీడాకారులకు ఓఎన్‌జీసీ ఆర్థిక సాయం

రాజమహేంద్రవరం రూరల్: స్పోర్ట్స్ స్కాలర్ షిప్ పథకం కింద క్రీడాకారులకు ఓఎన్‌జీసీ సంస్థ ఆర్థిక సాయం అందించనుందని జిల్లా ముఖ్యక్రీడాధికారి డీఎంఎం శేషగిరిరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆసక్తి, ప్రతిభ గల క్రీడాకారులందరూ ఓఎన్‌జీసీ స్పోర్ట్స్ స్కాలర్ షిప్ పథకం వెబ్‌సైట్ : sportsscholarship.ongc.co.in నుంచి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 వరకూ దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. దరఖాస్తు చేసుకొనేముందు నియమ నిబంధనలను చూసుకోవాలన్నారు.

విద్యాయాప్‌లో వివరాల అప్‌డేట్

అధికారులతో కలెక్టర్ మాధవీలత



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): విద్యా సంవత్సరం ముగుస్తున్న దృష్ట్యా ప్రతి తరగతికి చెందిన సిలబస్ పూర్తయ్యిందో కచ్చితంగా తనిఖీ చేసి, వాటి వివరాలను విద్యాయాప్‌లో అప్‌డేట్ చేయాలని అధికారులకు కలెక్టర్ మాధవీలత ఆదేశించారు. మండల విద్యాధికారులు, సహాయ ప్రాజెక్ట్ అధికారులతో శుక్రవారం రాత్రి ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి, ఎన్నో పథకాలను అమలు చేయడంతో పాటు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. పదో తరగతి పరీక్షలు దగ్గరపడుతున్న నేపథ్యంలో ఆయా స్కూళ్లలో నిర్వహిస్తున్న అదనపు తరగతులు, విద్యార్థుల సామర్థ్యం, మధ్యాహ్న భోజన పథకం అమలు, హాజరు శాతం, నాడు – నేడు పనుల వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి స్కూల్‌కి ఒక ఇన్‌చార్జి అధికారిని నియమించామని, వారు ప్రతి రోజూ ఒక స్కూల్ తనిఖీ చేసి, వాటి వివరాలు, ఫొటోలు పొందుపరచాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాధికారి ఎస్.అబ్రహం, డీఆర్‌డీఏ పీడీ ఎస్.సుభాషిణి, ఎంఈవోలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించిన హైకోర్టు న్యాయమూర్తి

అన్నవరం: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కె.మన్మథరావు కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి ఆలయ ఏఈఓ కృష్ణారావు ఆధ్వర్యంలో పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా సత్యదేవుని ప్రసాదాన్ని ఏఈఓ కృష్ణారావు బహూకరించారు. వారి వెంట శంఖవరం ఆర్ఐ భాస్కర ప్రసాద్ ఉన్నారు.

అక్రమార్కులపై ఉక్కుపాదం

- విస్తృతంగా విజిలెన్స్ దాడులు
- అక్రమార్కుల గుండెల్లో రైళ్లు
- ఏడాది కాలంలో సుమారు వెయ్యి తనిఖీలు
- రూ.11 కోట్ల వరకు స్వాధీనం
- 129 మందిపై కేసులు



కాకినాడ జిల్లా వేట్లపాలెంలోని ఆర్‌బీకే వద్ద విజిలెన్స్ తనిఖీలు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ప్రభుత్వం వివిధ పథకాలు, కార్యక్రమాలు అమలు చేయడంతోనే సరిపోదు. వాటి అమలు తీరును పర్యవేక్షించడం కూడా కీలకమే. ఇందులో భాగంగానే ప్రతి విభాగం పని తీరుపై విజి'లెన్స్' పెడుతుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని పరుగులు పెట్టిస్తోంది. పారదర్శకంగా, ఎక్కడా అవినీతికి తావులేని విధంగా పాలన అందించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా ఎక్కడికక్కడ ముమ్మరంగా తనిఖీలు చేస్తూ అక్రమార్కులు, అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తోంది. ఏడాది కాలంగా విజిలెన్స్ అధికారులు మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఎన్నడూ చూడని రంగాల్లో సైతం దాడులు చేస్తూ, అక్రమార్కులపై చర్యలు తీసుకుంటున్నారు.

గతంలో నేతల జోక్యం

ప్రచారం కోసం దాడులు చేయడం.. ఆనక దొడ్డిదారిన కేసులు లేకుండా వదిలేసే పరిస్థితి గత ప్రభుత్వంలో ఉండేది. రాజకీయ నేతల సిఫారసులతో విజిలెన్స్ అధికారులు సైతం చేతులెత్తేసేవారు. ఒకవేళ అనివార్యంగా కేసులు నమోదు చేసినా నేతలు జోక్యం చేసుకుని, వాటిని నీరుగార్చేసేవారు. ఫలితంగా అసలు విజిలెన్స్ ఉందా అనే అనుమానాలుండేవి. నాటి పాలకుల తీరుతో విసుగెత్తిపోయిన సంబంధిత అధికారులు సైతం మిన్నకుండిపోయేవారు.

నేడు ఉక్కుపాదం

గత ప్రభుత్వ విధానాలకు పూర్తి భిన్నంగా విజిలెన్స్ అధికారులు ప్రస్తుతం నిరంతరం క్షేత్ర స్థాయిలోనే ఉంటూ అక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతున్నారు. తప్పు చేసిన వారిని జైలుకు పంపడానికి సైతం వెనుకాడటం లేదు. దాడులు చేసి, తప్పులు జరిగాయని గుర్తిస్తే కేసులు నమోదు చేసి, సరకు సీజ్ చేసి కోర్టుకు అప్పగిస్తున్నారు.

- ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు చేరాల్సిన రేషన్ బియ్యాన్ని మార్కెట్‌లో అడ్డంగా అమ్మేస్తున్న వారిని వల పన్ని పట్టుకుని మరీ కేసులు నమోదు చేస్తున్నారు. ఫలితంగా రేషన్ బియ్యం అక్రమాలకు ఎక్కడికక్కడ అడ్డుకట్ట పడుతోంది.
- నిత్యావసర వస్తువుల తూకాల్లో మోసాలు, ఎరువులు, విత్తనాలు, వంట నూనెలు, గ్యాస్ సిలిండర్లు, పెట్రోలు వంటి వాటి నాణ్యత, పరిమాణంలో తేడాల వంటి వాటిని నియంత్రిస్తున్నారు.
- అంగన్‌వాడీ కేంద్రాలు, ఆస్పత్రులు, నాడు–నేడులో పాఠశాలల ఆధునీకరణ, రెస్టారెంట్లు, హోటళ్లు, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ తదితర శాఖల్లో జరుగుతున్న పనుల్లో అవకతవకల వంటి అన్నింటి పైనా విజిలెన్స్ నిఘా పెరిగింది.
- వ్యాపార, వాణిజ్య సంస్థలతో పాటు పలు ప్రభుత్వ శాఖలు కూడా పారదర్శకంగా వ్యవహరించాల్సిన పరిస్థితులను విజిలెన్స్ దాడులు కల్పిస్తున్నాయి.

రూ.265 కోట్ల బకాయిల వసూలుకూ చర్యలు

ఆయా శాఖల ఉదాసీనతతో 2022–23 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వానికి రెవెన్యూ బకాయిలు భారీగానే పెండింగ్‌లో ఉండిపోయాయి. దీనిపై కూడా విజిలెన్స్ అధికారులు స్పందించారు. పురపాలన, రెవెన్యూ, పోర్టు, వాణిజ్య పన్నులు తదితర శాఖలను అప్రమత్తం చేశారు. తద్వారా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా రూ.265 కోట్ల మేర రెవెన్యూ బకాయిల వసూలులో క్రియాశీలకంగా వ్యవహరించారు.

నిరంతరం నిఘా



ప్రజల్లో అవగాహన బాగా పెరిగింది. మాపై ఎంతో నమ్మకంతో క్షణాల్లో అక్రమాల సమాచారం ఇస్తున్నారు. ఇటీవల రేషన్ బియ్యం అక్రమ రవాణాను ఎక్కువగా కట్టడి చేయగలగడానికి ప్రజల నుంచి వచ్చిన సమాచారమే కారణం. తూకాల్లో మోసాలను కూడా మా దృష్టికి తీసుకు రావచ్చు. ప్రజలు ఇచ్చే సమాచారాన్ని ఎక్కడా వెల్లడించం. అది వాస్తవమని నిర్ధారణ అయితే అక్రమార్కులపై చర్యలు తప్పవు. మోసాలు, అక్రమాలపై నిరంతరం నిఘా పెడుతున్నాం. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం చెప్పిన అన్ని అంశాల్లోనూ నూరు శాతం ఫలితాలు సాధించాం.

– పీవీ రవికుమార్, ఎస్పీ, విజిలెన్స్ విభాగం, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా

తనిఖీలు చేశారిలా...

ఆయిల్ షాపులు	: 255
సీజ్ చేసినవి	: 150 క్వింటాళ్లు
విలువ	: రూ.80 వేలు
తూకాల్లో తేడాల కేసులు	: 148
6ఏ కేసు	: 1
క్రిమినల్ కేసు	: 1
విత్తనాలు/ఎరువుల షాపులు	: 55
6ఏ కేసులు	: 19
మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు	: 2
సీజ్ చేసిన విత్తనాలు	: 3.87 క్వింటాళ్లు
సీజ్ చేసిన ఎరువులు	: 327.162 మెట్రిక్ టన్నులు
సీజ్ చేసిన పురుగు మందులు	: 3,573.757 లీటర్లు + 4,528.44 కేజీలు
సీజ్ చేసిన బయోపెస్టిసైడ్స్, ఎరువులు	: 144 కేజీలు + 26.80 లీటర్లు
మొత్తం వీటి విలువ	: రూ.180.42 లక్షలు
అధిక ధరలకు విక్రయించిన వారిపై కేసులు	: 18
మాంసాహార దుకాణాలు	: 225
తూకాల్లో తేడాలున్నవి	: 88
పర్యాటక ప్రాంతాల్లో తనిఖీ చేసినవి	: 38
ధరల్లో తేడా ఉన్నవి	: 21
పప్పు దుకాణాలు	: 19
తూకాల్లో తేడాలున్నవి	: 11
స్టాంప్ వెండర్ దుకాణాలు	: 8
అధికంగా వసూలు చేస్తున్నవి	: 8
మినరల్ వాటర్ ప్లాంటు	: 8
సీజ్ చేసినవి	: 8
అంగన్‌వాడీ కేంద్రాలు	: 7
పీహెచ్‌సీ/సీహెచ్‌సీలు	: 15
ఎస్సీ/బీసీ వెల్ఫేర్ హాస్టళ్లు	: 10
హౌసింగ్ కాలనీల్లో తనిఖీలు	: 88
జగనన్న విద్యా కానుకపై తనిఖీ చేసిన పాఠశాలలు	: 3
జగనన్న గోరుముద్దపై తనిఖీ చేసినవి	: 9
ఆర్‌బీకేలు	: 9
గ్రావెల్/మట్టి తరలింపుపై పరిశీలన	: 2
నమోదు చేసిన క్రిమినల్ కేసులు	: 2
సీజ్ చేసిన మొత్తం	: రూ.80.47 లక్షలు
రేషన్ బియ్యం	: 8,435.34 క్వింటాళ్లు
ధాన్యం	: 16,612.13 క్వింటాళ్లు
నూకల బియ్యం	: 274.5 క్వింటాళ్లు
రంగు మారిన ధాన్యం	: 198.5 క్వింటాళ్లు
సాధారణ బియ్యం	: 8,422.73 క్వింటాళ్లు
ఫోర్టిఫైడ్ రైస్	: 186 క్వింటాళ్లు
బియ్యం ఊక	: 51.75 క్వింటాళ్లు
చిన్న నూక బియ్యం	: 39 క్వింటాళ్లు
కందిపప్పు	: 29.99 క్వింటాళ్లు
పంచదార	: 28.90 క్వింటాళ్లు
పీఎంజీకేవై బియ్యం	: 91.3 క్వింటాళ్లు
ఐసీడీఎస్ పప్పు	: 1.17 క్వింటాళ్లు
ఐసీడీఎస్ పామాయిల్	: 41 లీటర్లు
పెట్రోలు	: 11,523 లీటర్లు
డీజిల్	: 18,199 లీటర్లు
జీవ ఇంధనం	: 10,965 లీటర్లు
గ్యాస్ సిలిండర్లు	: 67
మొత్తం సీజ్ చేసిన వాటి విలువ	: రూ.11,09,21,840
మొత్తం 6ఏ కేసులు	: 101
మొత్తం క్రిమినల్ కేసులు	: 42
అవకతవకల్లో ప్రమేయం ఉన్నట్టు ఆరోపించినవి	: 129

వ్యవసాయ, అనుబంధ సమస్యల పరిష్కారం

- జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు
- కలెక్టరేట్‌లో వ్యవసాయ సలహా మండలి సమావేశం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): వ్యవసాయ, అనుబంధ సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలూ తీసుకుంటున్నట్టు జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, జలవనరుల, పౌర సరఫరాల, మార్కెటింగ్, విద్యుత్, పీఆర్, ఉద్యానవన శాఖలకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ రబీ కోతలు జరుగుతున్న ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను మార్చి 25 నుంచి అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. అనంతరం మండలాల వారీగా వివిధ అంశాలపై చర్చించారు. కాలువలకు నీటి విడుదల ఆపివేసే సమయంలో పూడికతీత పనులు చేపడతామన్నారు. ఉద్యానవన శాఖ ద్వారా రాష్ట్రంలోనే అత్యధికంగా పామాయిల్ కొనుగోలు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 2000 వేల హెక్టార్లలో డిప్ ఇరిగేషన్ లక్ష్యం కాగా.. 1,814 మంది రైతులకు చెందిన 2,316 హెక్టార్లలో ఏర్పాటు చేశామన్నారు. ఏప్రిల్ నుంచి పశువుల బీమా పథకం అందుబాటులోకి వస్తుందన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు కంటే వినయ్ తేజ్ మాట్లాడుతూ రానున్న రబీ సీజన్‌లో గన్ని బ్యాగులను ఆయా కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో ఆదర్శ రైతుల ఇతర వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, ప్రాజెక్ట్ డైరెక్టర్ (మైక్రో ఇరిగేషన్) ఎస్. రామ్ మోహన్, గ్రౌండ్ వాటర్ డీడీ వై.శ్రీనివాస్, జేడీ (మత్స్య) కృష్ణారావు, డీహెచ్‌ఓ వి.రాధాకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి మాధవరావు

శ్రీవారి క్షేత్రంలో మరిన్ని వసతులు



పాత ప్రసాదాల కౌంటర్ తొలగింపు పనులు



శ్రీవారి వాహనాలను భద్రపరచేందుకు అనివేటి మండపంలో ఏర్పాటు చేస్తున్న గ్రిల్స్

- రూ.23 కోట్లతో అనివేటి మండప విస్తరణ
- శాశ్వత క్యూ కాంప్లెక్స్ నిర్మాణ పనులు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీవారి కొండపై భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు దేవస్థానం పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. రూ.23 కోట్లతో అనివేటి మండప విస్తరణ, శాశ్వత క్యూ కాంప్లెక్స్ నిర్మాణ పనులను చేపట్టింది. ప్రస్తుతం ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నిర్మాణాలు పూర్తయితే క్షేత్ర రూపురేఖలు మారిపోనున్నాయి.నిత్యం చినవెంకన్న క్షేత్రాన్ని 7 నుంచి 15 వేలాది మంది సందర్శిస్తుంటారు. శని, ఆదివారాలు, ఇతర పర్వదినాల్లో ఈ సంఖ్య 30 నుంచి 50 వేల వరకు ఉంటోంది. ప్రస్తుతం ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలోని తాత్కాలిక వైకుంఠం క్యూ కాంప్లెక్స్ భక్తులకు సౌకర్యవంతంగా ఉంది. దీనిని శాశ్వతంగా నిర్మించేందుకు పాత ప్రసాదాల కౌంటర్ వెనుక భాగాన రూ.12.50 కోట్లతో క్యూ కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్నారు. తూర్పు రాజగోపుర ప్రాంతంలో గతంలో రూ. 6.50 కోట్లతో శిల్పకళ ఉట్టిపడేలా 300 అడుగుల పొడవైన అనివేటి మండపాన్ని నిర్మించారు. భక్తులకు, వివాహాది శుభకార్యాలు జరుపుకునే వారికి ఇదిసౌకర్యంగా ఉంది. దీన్ని రూ. 10.50 కోట్లతో మరో 300 అడుగులు (జంట గోపురాల వరకు) విస్తరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

పలు విభాగాల మార్పు

తూర్పు రాజగోపుర ప్రాంతంలోని పాత ప్రసాదాల కౌంటర్‌ను పొక్లెయిన్‌ల సహాయంతో తొలగిస్తున్నారు. ఆ భవనంలో ఉన్న స్వామివారి వాహనశాలను అనివేటి మండపంలోకి, వీఐపీ లాంజ్‌ను శ్రీనివాస అతిథి గృహంలోకి, ఆధ్యాత్మిక గ్రంథాలయాన్ని బుకింగ్ కౌంటర్ల పక్కన క్యాంటీన్ నిమిత్తం నిర్మించిన భవనంలోకి మార్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీవారి వాహనాలు భక్తులకు కనిపించేలా, వాటికి రక్షణ ఉండేలా అనివేటి మండపం చుట్టూ ఇనుప గ్రిల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అనివేటి మండప విస్తరణ పనుల్లో భాగంగా తూర్పు ప్రాంతంలోని అన్ని షాపులను పార్కింగ్ ప్రాంతంలోకి మార్చనున్నారు. ఈ క్రమంలో షాపుల నిర్మాణ పనులు అక్కడ వేగంగా జరుగుతున్నాయి.

సౌకర్యాల కల్పనే లక్ష్యం



ప్రస్తుతం క్షేత్రంలో అనివేటి మండప విస్తరణ, శాశ్వత క్యూ కాంప్లెక్స్ నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయి. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డీవీ భాస్కర్ పనులను పర్యవేక్షిస్తున్నారు. ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఆలయ పాలకవర్గ సభ్యుల సహకారంతో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేస్తాం.

- వేండ్ర త్రినాథరావు, శ్రీవారి దేవస్థానం ఈఓ

వర్షం.. అప్రమత్తం

సాక్షి, రాజమహేంద్రవరం: బంగాళాఖాతంలో ద్రోణి ప్రభావంతో రాబోయే మూడు రోజుల పాటు జిల్లాలో విస్తారంగా వర్షాలు, పిడుగులు పడనున్నట్లు ఐఎండీ సూచించింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఒక్కసారిగా చినుకులు పడగా.. ఓ మోస్తరు వర్షపాతం నమోదైంది. రాజమహేంద్రవరంలో చిరజల్లులు పడ్డాయి. పెరవలిలో మోస్తరుగా నమోదైంది. వర్షంతో మెట్ట ప్రాంతాల్లో పంటల సాగుకు ఉపయుక్తం కానుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

జిల్లాలో సాగులో ఉన్న వరి పంట ప్రస్తుతం గింజ పలుపోసుకునే దశ నుంచి గింజ గట్టి పడే దశలో ఉందని వ్యవసాయ శాఖ అధికారి మాధవరావు తెలిపారు. ప్రసుత్తం ఆర్ఎస్ఆర్ 15048 రకం వరి కోతలు జరుగుతున్నాయి. పంట కోసిన వెంటనే వర్షానికి తడిసిపోకుండా, సురక్షిత ప్రాంతాలకు తరలించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాజమహేంద్రవరం, రాజానగరం ప్రాంతాల్లో 32,130 హెక్టార్లలో ఈ రకం సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు రాజమహేంద్రవరం మండలంలో 222 హెక్టార్లు, రాజానగరంలో 45 హెక్టార్లు కోతలు జరిగాయి. మిగిలిన వరి రకాలలో ఎంటీయూ–1121 రకం ఇంకా కోతలకు సమయం ఉంది. వర్షం వల్ల నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అధిక వర్షపాతం నమోదైతే డ్రైనేజీ సౌకర్యాలు ఏర్పాటు చేసుకుని పొలంలో అధిక నీటిని కాలువ ద్వారా బయటకు పంపితే వరికి నష్టం వాటిల్లదన్నారు.

ఉపాధి ఉత్సాహం..!

- జిల్లాలో ఊపందుకున్న పనులు
- మార్చి నెలాఖరుకి 59 లక్షల పనిదినాల కల్పనే లక్ష్యం
- ఇప్పటికీ 51 లక్షలు పూర్తి



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

సాక్షి, రాజమహేంద్రవరం: జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు ఊపందుకుంటున్నాయి. ఆక్వా, వ్యవసాయ పనులు విరివిగా ఉన్నా.. ఉపాధికి మాత్రం ఆదరణ తగ్గడం లేదు. గ్రామీణ ప్రాంత కూలీలకు పథకం కల్పతరువుగా మారుతోంది. దరఖాస్తు చేసుకున్న వెంటనే జాబ్ కార్డులు, పనులు చూపిస్తుండటంతో కూలీలు పనులకు క్యూ కడుతున్నారు. సకాలంలో బిల్లులు అందజేస్తుండటంతో పనులకు వచ్చే వారి సంఖ్య మరింత పెరుగుతోంది. తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 18 మండలాలు, 300 పంచాయతీల పరిధిలో 2.96 లక్షల మందికి ఉపాధి జాబ్‌కార్డులు జారీ చేశారు. 5.26 లక్షల మంది కూలీలు నమోదయ్యారు. 1.95 లక్షల మంది పనులు సద్వినియోగం చేసుకుంటున్నారు.

లక్ష్యం 59 లక్షల పనిదినాలు

జిల్లా వ్యాప్తంగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో 59 లక్షల పనిదినాలు కల్పించాలని డ్వామా అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇప్పటికి 51 లక్షల మందికి ఉపాధి కల్పించారు. 87.28 శాతం లక్ష్యాన్ని అధిగమించారు. మిగిలిన 8 లక్షల మందికి నెలాఖరు వరకు పనుల కల్పనకు కృషి చేస్తున్నారు. తద్వారా వందశాతం పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకెళుతున్నారు. గతేడాది 58 లక్షల పనిదినాలు మాత్రమే లక్ష్యం కాగా.. ఈ ఏడాది మరో లక్ష పెంచారు. ఇందుకుగాను ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నారు. ప్రస్తుతం రోజుకు 45 వేల మంది పనులకు వస్తుండగా, వీటి సంఖ్య మరింత పెంచనున్నారు. గతేడాది 7,489 మంది వంద రోజులు పూర్తి చేసుకున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 3,596 మంది కూలీలు వంద రోజుల పాటు పనులను సద్వినియోగం చేసుకున్నారు. మరో 85 నుంచి 99 రోజుల మధ్యలో ఉన్న వారు 18,476 మంది ఉన్నట్లు డ్వామా అధికారుల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

రూ.204 కోట్ల చెల్లింపులు

జిల్లాలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.204 కోట్ల మేర నిధులు వెచ్చించారు. ఇందులో కూలీలకు రూ.111.77 కోట్లు, మెటీరియల్ కాంపొనెంట్ కింద మరో రూ.92.41 కోట్లు చెల్లించారు. రోజుకు సగటున ఒక్కో కూలీకి రూ.219.28 వేతనం ఇస్తున్నారు. భూగర్భ జల మట్టం పెంచాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. తద్వారా పశువులకు తాగునీరు, ప్రజలకు తాగు, సాగునీటి కొరత నివారించడం లక్ష్యం. అందుకుగాను అమృత్ సరోవర్ పథకంలో భాగంగా చెరువుల సుందరీకరణ, అస్తవ్యస్తంగా, పిచ్చిమొక్కలతో రూపుకోల్పోయిన చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. జిల్లా వ్యాప్తంగా కనీసం ఎకరా, ఆపై విస్తీర్ణం ఉన్న చెరువులను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. చెరువు విస్తీర్ణాన్ని బట్టి రూ.4 లక్షల నుంచి రూ.17.50 లక్షల వరకు నిధులు కేటాయించారు. 80 చెరువులను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా నిర్దేశించంగా ఇప్పటికే 24 చెరువుల సుందరీకరణ పూర్తయింది. ఉపాధి పనులకు మహిళలే అధిక శాతం హాజరవుతున్నారు. కూలీల ఆరోగ్య రక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు.

లక్ష్య సాధనకు కృషి



జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో 59 లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. గతేడాది కంటే ఈ ఏడాది లక్ష పనిదినాలు ఎక్కువ కావడం వల్ల కాస్త ఆలస్యం అవుతోంది. అనుకున్న సమయానికి లక్ష్యాన్ని అధిగమించేందుకు కృషి చేస్తాం. ఇందుకు గాను జిల్లా కలెక్టర్ కె.మాధవీలత ఆదేశాల మేరకు ప్రణాళికలు రూపొందించాం.

– రాంగోపాల్, డ్వామా పీడీ, తూర్పుగోదావరి

క్రైం కార్నర్..

నాన్‌స్టాప్ బస్సు - టిప్పర్ ఢీ



ఎదురెదురుగా ఢీకొన్న బస్సు - టిప్పర్

రంగంపేట: వడిశలేరు శివారు సూర్యనారాయణపురం వద్ద ఏడీబీ రోడ్డుపై శుక్రవారం ఉదయం ఆర్టీసీ నాన్‌స్టాప్ బస్సు - టిప్పర్ ఢీకొన్నాయి. స్థానికుల కథనం ప్రకారం రాజమహేంద్రవరం నుంచి కాకినాడ వెళుతున్న నాన్‌స్టాప్ బస్సు, రంగంపేట వైపు నుంచి రాజానగరం వైపు వెళుతున్న టిప్పర్ సూర్యనారాయణపురం వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. రెండు వాహనాలూ నెమ్మదిగా రావడంతో త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. బస్సు నిండా ప్రయాణికులున్నారని, ఏమాత్రం వేగంగా వచ్చినా పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో బస్సులోని ముగ్గురు మహిళలకు బలమైన గాయాలయ్యాయి. వారిని వెంటనే 108లో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. వర్షం కారణంగా ఈ ప్రమాదం జరిగింది. దీనిపై తమకు ఎటువంటి ఫిర్యాదూ అందలేదని పోలీసులు తెలిపారు.

మానసిక దివ్యాంగురాలిపై ఘాతుకానికి యత్నం

కపిలేశ్వరపురం: అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటున్న ఓ మానసిక దివ్యాంగురాలిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. అంగర ఎస్సై జి.చంటి కథనం ప్రకారం.. కె.గంగవరం మండలం యండగండికి చెందిన యువతి మానసిక దివ్యాంగురాలు. తండ్రి మరణించగా తల్లి కువైట్‌లో ఉంటోంది. దీంతో ఆ యువతి అమ్మమ్మ, తాతయ్యల సంరక్షణలో కపిలేశ్వరపురంలో ఉంటోంది. గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఉన్న యువతిపై లైంగిక దాడికి గ్రామానికి చెందిన మెట్టి శ్రీను ప్రయత్నించాడు. ఆ సమయంలో నిద్రపోతున్న తాత మేల్కొని, అప్రమత్తం కావడంతో నిందితుడు పరారయ్యాడు. తాతయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడు శ్రీనుపై కేసు నమోదు చేసి, శుక్రవారం అరెస్టు చేసి, కోర్టుకు తరలించారు.

పూటుగా తాగి అమాయకుడిపై దాడి

- టీ తాగడానికి డబ్బులడిగాడని ఉన్మాదుల దుశ్చర్య
- బాధితుడికి తీవ్ర గాయాలు



బాధితుడు రమేష్



రమేష్‌పై దాడి చేస్తున్న దుండగులు (సీసీ ఫుటేజీ చిత్రం)

గండేపల్లి: తప్ప తాగిన ముగ్గురు వ్యక్తులు ఉన్మాదుల్లా ప్రవర్తించి, ఒక వ్యక్తిపై విచక్షణా రహితంగా దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై వై.గణేష్ కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని తాళ్లూరుకు చెందిన మింది రామచంద్రరావు(రమేష్)కు తల్లిదండ్రులు లేరు. అమ్మమ్మ యర్రంనీడి సూర్యకాంతం వద్ద ఉంటున్నాడు. మనోవేదనతో ఉన్న రమేష్ అనారోగ్యానికి గురై, ఏ పనీ చేయలేక ఇంటి వద్దే ఉంటున్నాడు. టీ తాగేందుకు గురువారం తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో ఇంటికి సమీపంలో గ్రామ శివారున ఉన్న శ్రీ సాయి బాలాజీ హోటల్ వద్దకు వెళ్లాడు. అదే సమయంలో ఉప్పలపాడుకు చెందిన బాదం చిన వీర్రాజు, అడబాల చక్రదొరబాబు, బొర్రంపాలెంలోని అత్తవారింటికి వచ్చిన కాకినాడ డ్రైవర్ కాలనీకి చెందిన ఎర్రమనీడి వరప్రసాద్ అక్కడకు వచ్చారు. టీ తాగేందుకని వారిని రమేష్ డబ్బులు అడిగాడు. అప్పటికే పూటుగా మద్యం తాగి ఉన్న వారు.. 'మమ్మల్ని డబ్బులు అడుగుతావా? ఏదైనా పని చేసుకుని బతకవచ్చు కదా' అంటూ రమేష్‌పై ఒక్కసారిగా దాడికి పాల్పడ్డారు. విచక్షణరహితంగా గాయపరచి ఒంటిపై దుస్తులూడదీసి, సెల్‌ఫోన్లో చిత్రీకరిస్తూ చిత్రహింసలకు గురి చేశారు. 'దేశానికి నీవల్ల ఉపయోగం లేదురా' అంటూ ఒక దశలో హత్యాయత్నానికి పాల్పడ్డారు. 'ఎప్పుడూ మిమ్మల్ని డబ్బులు అడగను.. వదిలేయండి' అంటూ బాధితుడు మొత్తుకుంటున్నా వినకుండా మర్మ భాగంలోకి బీరు సీసాలు చొప్పించారు. కర్ర, ఇనుప గొట్టంతో దాడి చేయడంతో రమేష్ కుడి కాలు విరిగిపోయింది. హోటల్ వెనుకన దాడి జరగడం, అక్కడ జనసంచారం లేకపోవడంతో ఈ విషయాన్ని చాలాసేపు ఎవ్వరూ గుర్తించలేదు. బాధితుడు ఉదయం 9 గంటల వరకూ సంఘటన స్థలం వద్దే కొట్టుమిట్టాడుతూ నరకయాతన పడ్డాడు. హోటల్ నిర్వాహకులు ఇచ్చిన సమాచారంతో 108 సిబ్బంది రమేష్‌ను రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని, సీసీ ఫుటేజీలను పోలీసులు పరిశీలించి, దాడికి పాల్పడిన ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, రౌడీషీట్ ఓపెన్ చేయనున్నామని ఎస్సై గణేష్ కుమార్ తెలిపారు. బాధితుని అమ్మమ్మ ఫిర్యాదు మేరకు జగ్గంపేట సీఐ బి.సూర్య అప్పారావు పర్యవేక్షణలో కేసు నమోదు చేయనున్నామని చెప్పారు.

రాజమండ్రి మహిళా కమిటీ సేవలు స్ఫూర్తిదాయకం



కార్యక్రమంలో పాల్గొన్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ

- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ
- ఘనంగా సంస్థ 20వ వార్షికోత్సవం

రాజమహేంద్రవరం సిటీ: మహిళల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్న రాజమండ్రి మహిళా కమిటీ సేవలు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. స్థానిక తాడితోట సంహిత డిగ్రీ కళాశాలలో రాజమండ్రి మహిళా కమిటీ 20వ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి పద్మ మాట్లాడుతూ, మహిళల అభ్యున్నతి, చైతన్యం కోసం, సమస్యల పరిష్కారానికి మహిళా కమిటీ పోరాటం చేస్తోందన్నారు. పార్టీలకు అతీతంగా అన్ని సంఘాలనూ కలుపుకొని, ఐక్యంగా ముందుకు సాగుతోందని ప్రశంసించారు. మహిళా కమిటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ రమణ ఎస్.చౌదరి ప్రథమ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. కమిటీలో అప్పటి నుంచి నేటి వరకూ విజయలక్ష్మి రెడ్డి, గ్రంధి లలిత, లక్ష్మీ శ్రీనివాస్ సభ్యులుగా ఉన్నారన్నారు. ఇక నుంచి జక్కంపూడి విజయలక్ష్మి సారథ్యంలో రాజమండ్రి మహిళా కమిటీ పని చేస్తుందన్నారు. గతంలో తాను ఈ కమిటీ కార్యదర్శిగా పని చేశానని, ప్రస్తుతం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళల రక్షణ కోసం రాజమండ్రి మహిళా కమిటీ ప్రతి నెలా న్యాయ అవగాహన సదస్సు, కళాశాలలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ, మదర్ మిల్క్ బ్యాంకు, మెడికల్ హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం శుభపరిణామమని అన్నారు. కార్యక్రమంలో హర్ష ఆసుపత్రి డాక్టర్ అరుణ్ కుమారి, సీనియర్ అడ్వొకేట్ వి.ఉమామహేశ్వరి, డాక్టర్ చల్లా సత్యవాణి పాల్గొన్నారు.

లైన్ క్లియర్

- 2021 డిసెంబర్‌లో గుజరాత్ నుంచి బయలుదేరి భారీ ట్యాంకర్లు
- గత ఏడాది మార్చిలో కోడూరుపాడు చేరిక
- గమ్యం చేరే దారి లేక అప్పటి నుంచీ రోడ్డు పైనే తిష్ట
- ఎట్టకేలకు మార్గం సుగమం



బెండమూర్లంక సెంటర్‌లో నిలిచి ఉన్న రెండు భారీ గ్యాస్ ట్యాంకర్లు

అల్లవరం: రెండు భారీ గ్యాస్ ట్యాంకర్లు ఓడలరేవు ఓఎన్‌జీసీ టెర్మినల్‌కు చేరడానికి సుదీర్ఘ కాలం తరువాత ఎట్టకేలకు లైన్ క్లియర్ అయింది. గుజరాత్ నుంచి 62 అడుగుల పొడవు, 20 అడుగుల ఎత్తు ఉన్న ఈ రెండు భారీ గ్యాస్ ట్యాంకర్లు గమ్యం చేరడానికి ఎన్నో అడ్డంకులు, అవాంతరాలు ఏర్పడ్డాయి. గుజరాత్ నుంచి 2021 డిసెంబర్‌లో రోడ్డు మార్గాన ఈ ట్యాంకర్లు బయలుదేరాయి. గత ఏడాది మార్చి నాటికి అల్లవరం మండలం కోడూరుపాడు చేరాయి. అక్కడి నుంచి ఓఎన్‌జీసీ టెర్మినల్‌కు ఇంత భారీ వాహనాలు చేరేందుకు సరైన మార్గం లేకపోయింది. దీంతో అక్కడే ప్రధాన రహదారిపై సుమారు ఎనిమిది నెలల పాటు వాటిని నిలిపివేశారు. తరువాత గోడిలంక పీహెచ్‌సీ వద్ద కొన్ని రోజులు, బెండమూర్లంక సెంటర్ వద్ద ప్రధాన రహదారిపై కొన్నాళ్లు నిలిపి ఉంచారు. ఈ భారీ ట్యాంకర్లను గమ్యానికి చేర్చేందుకు అల్లవరం, బెండమూర్లంక, ఓడలరేవు గ్రామాల్లో సుమారు పది కిలోమీటర్ల పొడవునా ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఇళ్లు, షాపులు, ప్రహరీలు, కరెంట్ స్తంభాలను తొలగించాల్సి వచ్చింది. షాపులు, ఇళ్లు, కోల్పోయిన బాధితులకు పరిహారం తదితర కారణాలతో ఎడతెగని జాప్యం జరిగింది. ఓఎన్‌జీసీ, రెవెన్యూ, స్థానిక నాయకుల సహకారంతో పలుమార్లు బాధితులతో చర్చలు జరిపారు. చివరకు ట్యాంకర్లు ఓఎన్‌జీసీకి చేరడానికి ఉన్న ఇబ్బందులను తొలగించారు. దీంతో రెండు నెలలుగా బెండమూర్లంక సెంటర్‌లో నిలిపి ఉన్న ట్యాంకర్లు శనివారం అర్ధరాత్రి కదలనున్నాయి. ఇవి ప్రయాణించే సమయంలో ఎటువంటి ప్రమాదాలూ జరగకుండా ముందస్తుగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు, టాటా కంపెనీకి చెందిన సిబ్బంది ఆధ్వర్యాన ఈ ట్యాంకర్లు ముందుకు కదలనున్నాయి. ట్యాంకర్లను తరలించడానికి శనివారం అర్ధరాత్రి ఒంటిగంట నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఈపీడీసీఎల్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే ట్యాంకర్లు వెళ్తున్న ప్రతిసారీ గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని వినియోగదారులు ఆవేదన చెందుతున్నారు. ఆక్వా సాగుకు మార్చి నెల ఎంతో కీలకమని, ఈ సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తే తమకు ఇబ్బందని ఆక్వా రైతులు అంటున్నారు.

మరో తిరుపతిలా అన్నవరం

- భవిష్యత్తులో సత్యదేవునికి దశదిశలా మరింత ఖ్యాతి
- కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి



ప్రసాద తయారీ భవనాన్ని సందర్శించిన శంకర విజయేంద్ర సరస్వతి

అన్నవరం: సత్యదేవుడు కొలువు తీరిన అన్నవరం క్షేత్రం భవిష్యత్తులో మరో తిరుపతిలా అభివృద్ధి చెందుతుందని, ఇక్కడ రత్నగిరిపై వెలసిన సత్యదేవుని ఖ్యాతి దశదిశలా మరింత వ్యాప్తి చెందుతుందని కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి అన్నారు. శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారిని ఆయన శుక్రవారం తెల్లవారుజామున దర్శించారు. గర్భాలయంలోని శివలింగానికి స్వయంగా అభిషేకం, సత్యదేవుడు, అనంతలక్ష్మి సత్యవతీదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. పెద్దాపురానికి చెందిన శ్రీ లలితా రైస్ ఇండస్ట్రీ అధినేతల్లో ఒకరైన ప్రముఖ దాత మట్టే సత్యప్రసాద్ దంపతులు సత్యదేవునికి తయారు చేయించిన వజ్రకిరీటాన్ని ఈ సందర్భంగా పరిశీలించారు. గత ఏడాది తన చేతుల మీదుగా దేవస్థానానికి దాత అందజేసిన ఈ కిరీటం స్వామివారికి చాలా శోభనిచ్చిందని శంకర విజయేంద్ర సరస్వతి అన్నారు. త్వరలోనే అనంతలక్ష్మి సత్యవతీదేవి అమ్మవారికి కూడా వజ్రకిరీటం చేయిస్తున్నానని స్వామీజీకి సత్యప్రసాద్ వివరించారు. గర్భాలయంలో గోడలు, ద్వారాలు, పైకప్పుకు బంగారు తాపడం, పంచ హారతుల సేవకు వెండి సామగ్రి కూడా అందజేశానని చెప్పారు. దాత జీవితం ధన్యమైందని, సత్యదేవుడు, అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా వారికి ఉంటాయని స్వామీజీ ఆశీర్వదించారు. అనంతరం దాత మట్టే సత్యప్రసాద్ దంపతులు రూ.5 కోట్లతో నిర్మించిన సత్యదేవుని ప్రసాద తయారీ భవనాన్ని కూడా కంచి పీఠాధిపతి సందర్శించారు. ప్రసాదం తయారీ విధానాన్ని అక్కడి సిబ్బంది వివరించారు. నాణ్యతలో రాజీ పడకుండా స్వామివారి ప్రసాదం తయారు చేయాలని పీఠాధిపతి సూచించారు. కార్యక్రమంలో దేవస్థానం ఏఈఓలు కృష్ణారావు, జగ్గారావు, ప్రసాద విభాగం సూపరింటెండెంట్ కోటమర్తి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ రాకతో నిలిచిన ప్రాణాలు



నిందితుడు దుర్గాప్రసాద్ (పాతచిత్రం)



దాడి అనంతరం క్షతగాత్రుడు చిన్నారావును ఆసుపత్రికి తరలించేందుకు పోలీసులతో కలిసి ఆటో ఎక్కిస్తున్న నిందితుడు దుర్గాప్రసాద్

కాకినాడ క్రైం: అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ) మిద్దే చిన్నారావు హత్యాయత్నం నుంచి ప్రాణాలతో బయట పడటానికి అటుగా డీఎస్పీ రావడమే కారణమైంది. కొబ్బరి బొండాల వ్యాపారం చేసుకునేందుకు ఉపయోగిస్తున్న తన ఆటోను సీజ్ చేయవద్దంటూ జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఏఎంవీఐగా పని చేస్తున్న చిన్నారావుపై నిందితుడు పెంటా వెంకట దుర్గాప్రసాద్ శుక్రవారం కత్తితో దాడికి పాల్పడ్డాడు. కాకినాడ డీఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఈ ఘటన జరిగింది. చిన్నారావుపై దుర్గాప్రసాద్ దాడికి పాల్పడుతున్న సమయంలోనే డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి ఇంటర్మీడియెట్ పరీక్షల పరిశీలనకు తన కార్యాలయం నుంచి బయలుదేరారు. హత్యాయత్నం జరిగిన ప్రాంతం మీదుగా వస్తున్న ఆయన వాహనం సైరన్ మోగడంతో చిన్నారావుపై కత్తి వేట్లు వేస్తున్న దుర్గాప్రసాద్ ఒక్కసారిగా ఆగిపోయాడు. జరుగుతున్న దారుణాన్ని గమనించిన డీఎస్పీ, ఆయన బృందం ఒక్కసారిగా తన వాహనం ఆపి, కిందకు దిగారు. వారిని చూసి, భయంతో నిశ్చేష్టుడై కత్తి కింద పడేసి బిత్తరచూపులు చూస్తున్న దుర్గాప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. కత్తిపోట్లకు గురైన చిన్నారావును నిందితుడి సాయంతోనే జీజీహెచ్‌కు తరలించారు. ఈ క్రమంలోనే దుర్గాప్రసాద్ ఆసుపత్రిలో పోలీసులకు లొంగిపోయాడు. కొబ్బరి బొండాల వ్యాపారం చేసుకుంటున్న దుర్గాప్రసాద్‌ను చిన్నారావు గత కొన్నాళ్లుగా చీటికీమాటికీ వేధిస్తున్నాడని ప్రత్యక్ష సాక్షులు పోలీసులకు తెలిపారు. ఈ నేపథ్యంలో నిందితుడు దుర్గాప్రసాద్ పట్ల చిన్నారావు వైఖరి ఎలా ఉండేదనే కోణంలో కూడా పోలీసులు విచారిస్తున్నారు. కత్తి దాడిలో తెగిపడిన చిన్నారావు ఎడమ చేతి బొటన వేలిని అతికించేందుకు జీజీహెచ్‌కు చెందిన 9 మంది వైద్యులు శస్త్రచికిత్స చేశారు. చిన్నారావు శరీరంపై మొత్తం 34 కత్తిపోట్లు, గాయాలు గుర్తించామని వైద్యులు తెలిపారు. క్షతగాత్రుడికి ఆరు యూనిట్ల ఎ నెగటివ్ రక్తాన్ని ఎక్కించామని, మరో ఐదు యూనిట్లు సిద్ధం చేశామని సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి తెలిపారు. అలాగే, చిన్నారావు కారు డ్రైవరు సత్యనారాయణ చేతిలో పది వేళ్ల నరాలు తెగిపోయాయనీ వాటికీ చికిత్స జరుగుతోందని చెప్పారు.

మధ్యాహ్నం ఒంటి గంట వరకూ..

- పశ్చిమ రాజగోపురం కౌంటర్ వద్ద వ్రతాల టిక్కెట్ల విక్రయం
- ఇన్‌చార్జి ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదేశం

సాక్షి ఇంపాక్ట్

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో పశ్చిమ రాజగోపురం వద్ద ఉన్న వ్రతాల కౌంటర్‌లో మధ్యాహ్నం ఒంటి గంట వరకూ వ్రతాల టిక్కెట్లు విక్రయించాలని దేవస్థానం ఇన్‌చార్జి ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ ఆదేశించారు. '12 గంటలకే క్లోజ్' శీర్షికన 'సాక్షి' శుక్రవారం ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. ఈ కౌంటర్‌లో మధ్యాహ్నం 12 గంటల వరకూ మాత్రమే వ్రతాల టిక్కెట్లు విక్రయిస్తున్న విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. ఆ తరువాత వచ్చే భక్తులు వ్రతాల టిక్కెట్ల కోసం రామాలయం వద్ద ఉన్న కౌంటర్ వద్దకు నడిచి వెళ్లాల్సి రావడంతో ఇబ్బంది పడుతున్నారని వివరించింది. దీనిపై ఇన్‌చార్జి ఈఓ వెంటనే స్పందించారు. పూర్తి వివరాలు తెలపాలని సంబంధిత విభాగం సూపరింటెండెంట్ ఐవీ రామారావును ఆదేశించారు. తాను దేవస్థానానికి వచ్చినపుడు దీనిపై పూర్తి స్థాయిలో పరిశీలన జరుపుతానని, అంతవరకూ మధ్యాహ్నం ఒంటి గంట వరకూ టిక్కెట్లు విక్రయించాలని ఆదేశించారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

గోపాలపురం: మండలంలోని వాదాలకుంట గ్రామంలో శుక్రవారం పొగాకు బ్యారన్ దగ్ధమై, సుమారు రూ.6 లక్షల నష్టం వాటిల్లింది. జంగారెడ్డిగూడెం అగ్నిమాపక అధికారి బి.అబ్రహం కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన యలమాటి వెంకటేశ్వరరావు పొగాకు బ్యారన్ క్యూరింగ్ సమయంలో ప్రమాదవశాత్తూ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో పొగాకుతో సహా బ్యారన్ దగ్ధమైంది. దీనిపై పొగాకు బోర్డు అధికారులకు సమాచారం అందించామని రైతు చెప్పారు.

సివిల్ సర్వీసెస్ మహిళా వాలీబాల్ పోటీలకు ఎంపిక ..



వల్లూరి మాధవి (అన్నవరం)



టి.స్నేహ సుప్రజ (కాకినాడ)



సీహెచ్ అన్నపూర్ణ (కాకినాడ)



బి.పూర్ణ శ్యామల (తుని)

అన్నవరం: కేరళ రాజధాని తిరువనంతపురం సెంట్రల్ స్టేడియంలో ఈ నెల 22 నుంచి 26 వరకూ జరిగే ఆలిండియా సివిల్ సర్వీసెస్ మహిళల వాలీబాల్ పోటీలకు కాకినాడ జిల్లాకు చెందిన నలుగురు ఎంపికయ్యారు. వీరిలో అన్నవరం దేవస్థానం ఫార్మసీ సూపర్‌వైజర్ వల్లూరి మాధవి, కాకినాడ జీజీహెచ్‌కు చెందిన టి.స్నేహ సుప్రజ, కాకినాడ డీఐఓ సూపరింటెండెంట్ సీహెచ్ అన్నపూర్ణ, తుని జ్యుడీషియల్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన పి.పూర్ణశ్యామల ఉన్నారు. ఈ పోటీలకు మొత్తం 12 మందితో కూడిన రాష్ట్ర జట్టు శుక్రవారం రాష్ట్ర స్పోర్ట్స్, గేమ్స్ విభాగం కార్యదర్శి డాక్టర్ పి.భాస్కర్ ప్రకటించారు. ఎంపికైన క్రీడాకారులను అధికారులు అభినందించారు.

'రంగరాయ'లో ఉత్సాహంగా స్నాతకోత్సవం



స్నాతకోత్సవంలో పాల్గొన్న అధ్యాపకులు



డాక్టర్ ఐవీ రావు నుంచి వైద్య పట్టా అందుకుంటున్న విద్యార్థి

కాకినాడ క్రైం: ఎంబీబీఎస్ విద్యార్థుల స్నాతకోత్సవానికి రంగరాయ వైద్య కళాశాల ఆడిటోరియం శుక్రవారం రాత్రి వేదికైంది. 194 మంది విద్యార్థులు పట్టభద్రులై తమ వైద్య విద్య పట్టాను అందుకున్నారు. ముఖ్య అతిథిగా డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పూర్వ వీసీ డాక్టర్ ఐవీ రావు పాల్గొన్నారు. విద్యార్థులకు వైద్య విద్య పట్టాలు ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ ఐవీ రావు మాట్లాడుతూ, రంగరాయ వేదిక విద్యార్థులందరినీ ఏకం చేసిందన్నారు. ఈ చదువులమ్మ చెట్టు నీడలో ఎదిగిన ప్రతి విద్యార్థీ ఎల్లలు దాటి దేశ కీర్తిని, వైద్య విద్యా ప్రశస్తిని విస్తరించాలని ఆకాంక్షించారు. వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ దేవీమాధవి, అధ్యాపకులు పాల్గొన్నారు. వేదికంతా విద్యార్థుల కేరింతలు, ఆటపాటలతో మార్మోగింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

జేసీబీ ఢీకొని వ్యక్తి మృతి

దేవరపల్లి: మండలంలోని దుద్దుకూరు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన కొవ్వూరు మండలం ఐ.పంగిడికి చెందిన తోట దుర్గారావు (65) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం కొయ్యలగూడెం మండలం గంగవరంలోని బంధువుల ఇంటికి వెళ్లి బైక్‌పై తిరిగి వస్తూ దేవరపల్లి - దుద్దుకూరు మధ్య బందపురం పంచాయతీ పరిధిలోని డాబా హోటల్ వద్ద దుర్గారావు ప్రమాదానికి గురయ్యాడు. రోడ్డుపై గల జేసీబీని మలుపు తిప్పుతుండగా, బైక్ అదుపు తప్పి జేసీబీని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన దుర్గారావును చికిత్స కోసం తొలుత రాజమహేంద్రవరంలోని బొల్లినేని ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్టు ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నల్లజర్ల: మండలంలోని పుల్లలపాడు వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జంగారెడ్డిగూడెం మండలం లక్కవరానికి చెందిన అవిడి రామాంజనేయులు (45) అనే వ్యక్తి మృతి చెందాడు. పుల్లలపాడులోని బంధువుల ఇంటికి బైక్‌పై వచ్చిన ఆయన తిరిగి స్వగ్రామం వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతూండగా రాజమహేంద్రవరం నుంచి విజయవాడ వెళ్తున్న కారు ఢీకొట్టింది. రామాంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. నల్లజర్ల ఎస్సై నరసింహమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

• తెలంగాణ

గ్రూప్‌–1 ప్రిలిమ్స్‌ రద్దు!

- దీంతోపాటు ఏఈఈ, డీఏఓ పరీక్షలు కూడా..
- ప్రశ్నపత్రాల లీకేజీ నేపథ్యంలో టీఎస్‌పీఎస్సీ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్‌: ప్రశ్నపత్రాల లీకేజీ నేపథ్యంలో గ్రూప్‌–1 ప్రిలిమినరీ పరీక్షను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ (టీఎస్‌పీఎస్సీ) రద్దు చేసింది. దీనితోపాటు గత రెండు నెలల్లో నిర్వహించిన 'అసిస్టెంట్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌ (ఏఈఈ), డివిజనల్‌ అకౌంట్స్‌ ఆఫీసర్‌ (డీఏఓ)' పరీక్షలనూ రద్దు చేస్తున్నట్టు కమిషన్‌ శుక్రవారం ప్రకటించింది. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్‌) ప్రాథమిక నివేదికపై శుక్రవారం కమిషన్‌ ప్రత్యేక సమావేశం నిర్వహించింది. చైర్మన్‌, సభ్యులు, కార్యదర్శి పాల్గొన్న ఈ భేటీలో గ్రూప్‌–1 పరీక్షతో పాటు ఏఈఈ, డీఏఓ పరీక్షలపై చర్చించి.. వాటిని రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. ఇప్పటికే మార్చి ఐదున నిర్వహించిన అసిస్టెంట్‌ ఇంజనీర్‌ (ఏఈ) పరీక్షను రద్దు చేయడం తెలిసిందే. కాగా, గ్రూప్‌–1 ప్రిలిమినరీ పరీక్షను జూన్‌ 11వ తేదీన నిర్వహించాలని నిర్ణయించారు. మిగతా పరీక్షలను తిరిగి నిర్వహించే తేదీలను త్వరలో వెల్లడిస్తామని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి తెలిపారు.

చంద్రయాన్‌–3 'సామర్థ్య' పరీక్ష విజయవంతం

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చంద్రుడిపై పరిశోధనల కోసం ఈ ఏడాది జూన్‌ నెలాఖరులోపు చంద్రయాన్‌–3 ప్రయోగం నిర్వహించడానికి పకడ్బందీగా సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా బెంగళూరులోని యూఆర్‌ శాటిలైట్‌ సెంటర్‌లో మూడు మాడ్యూల్స్‌తో కూడిన చంద్రయాన్‌–3 ఉపగ్రహాన్ని తయారుచేసి అక్కడే దాని శక్తి సామర్థ్యాలను ఇటీవల పరీక్షించామని ఇస్రో గురువారం రాత్రి తన అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఆర్బిటర్‌ మాడ్యూల్‌, ల్యాండర్‌ మాడ్యూల్‌, రోవర్‌ మాడ్యూల్‌ మూడు విభాగాలుగా చంద్రయాన్‌–3 ఉపగ్రహాన్ని రూపొందించారు. చంద్రుడిపై ఉన్న వాతావరణాన్ని కృత్రిమంగా సృష్టించి ఆ ఉపగ్రహాన్ని పరీక్షించారు. ప్రయోగ సమయంలో ఎదురయ్యే కఠినమైన కంపనం, ధ్వని వాతావరణాన్ని తట్టుకునే సామర్థ్యాన్ని ధ్రువీకరించుకునేందుకు అవసరమైన పరీక్షలను విజయవంతంగా నిర్వహించామని ఇస్రో వెల్లడించింది.



బెంగళూరులోని యూఆర్‌ రావు శాటిలైట్‌ సెంటర్‌లో చంద్రయాన్‌-3 ఉపగ్రహాన్ని పరీక్షిస్తున్న దృశ్యం

భారత్‌–ఫ్రాన్స్‌ అంతరిక్ష సంబంధాలు బలోపేతం

భారత్‌–ఫ్రాన్స్‌ దేశాల అంతరిక్ష సంబంధాలు మరింత బలోపేతం చేసేందుకు ఫ్రెంచి ప్రభుత్వం నిరంతరం పనిచేయడానికి అంగీకారం తెలిపిందని ఇస్రో తన వెబ్‌సైట్‌లో శుక్రవారం పేర్కొంది. ఫ్రాన్స్‌ విదేశాంగ మంత్రిత్వశాఖ సమన్వయంతో ఆ దేశ నేషనల్‌ అసెంబ్లీ విదేశీ వ్యవహారాల పార్లమెంట్‌ స్టాండింగ్‌ కమిటీ అధ్యక్షుడు జీన్‌–లూయిస్‌ బౌర్లాంగెస్‌ నేతృత్వంలో ఫ్రెంచి ప్రతినిధి బృందం గురువారం బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. ఇస్రోలోని హ్యూమన్‌ స్పేస్‌ ఫ్లైట్‌ సెంటర్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ ఆర్‌.ఉమా మహేశ్వరన్‌ ఆధ్వర్యంలో ఇస్రో, డాస్‌ ప్రతినిధి బృందం ఫ్రెంచి ప్రతినిధుల బృందానికి భారత అంతరిక్ష కార్యక్రమాల గురించి వివరించింది.

ఏపీ ఇన్‌ పార్లమెంట్‌

ఏపీలో తగిన యూరియా నిల్వలున్నాయి

లోక్‌సభలో కేంద్రం వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌లో 2022–23 రబీ సీజన్‌కు తగిన యూరియా నిల్వలు ఉన్నాయని కేంద్ర ఎరువులు రసాయనాలు శాఖ సహాయ మంత్రి భగవంత్‌ ఖుబా తెలిపారు. 2022–23 రబీ సీజన్‌కు గానూ 12–3–23 నాటికి 7.82 లక్షల మెట్రిక్‌ టన్నులు అవసరం ఉండగా 11.69 లక్షల మెట్రిక్‌ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లు వైఎస్సార్‌సీపీ సభ్యుడు పీవీ మిథున్‌రెడ్డి ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. 2022–23కు గానూ 12–3–23 నాటి లెక్కల ప్రకారం 15.82 లక్షల మెట్రిక్‌ టన్నులు అవసరం కాగా.. 17.76 లక్షల మెట్రిక్‌ టన్నులు అందుబాటులో ఉన్నట్లు కేంద్ర సహాయ మంత్రి వెల్లడించారు.

మంగళగిరి ఎయిమ్స్‌లో 960 పడకలు

ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్ష యోజన పథకంలో భాగంగా మంగళగిరి ఎయిమ్స్‌ సహా 22 ఎయిమ్స్‌ల్లో 18,250 పడకలు మంజూరు చేశామని కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్‌ తెలిపారు. మంగళగిరి ఎయిమ్స్‌కు 960 బెడ్‌లు మంజూరు చేశామని వైఎస్సార్‌సీపీ సభ్యుడు వైఎస్‌ అవినాష్‌రెడ్డి ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

ఏపీలో మానవ అక్రమ రవాణా కేసుల తగ్గుదల

ఆంధ్రప్రదేశ్‌లో మానవ అక్రమ రవాణా కేసులు తగ్గుముఖం పడుతున్నాయని కేంద్ర మహిళ శిశు అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. 2019లో 245 కేసులు నమోదు కాగా 2020లో 171, 2021లో 168 కేసులు నమోదైనట్లు వైఎస్సార్‌సీపీ సభ్యురాలు చింతా అనూరాధ ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఎస్‌ఆర్‌బీ మెరుగుదల

ఆంధ్రప్రదేశ్‌లో సెక్స్‌ రేషియో ఎట్‌ బర్త్‌ (ఎస్‌ఆర్‌బీ) మెరుగుదలలో ఉందని కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 2014–15లో ఎస్‌ఆర్‌బీ 921 ఉండగా 2021–22 నాటికి 950కి చేరుకుందని వైఎస్సార్‌సీపీ సభ్యులు మార్గాని భరత్‌రామ్‌, సంజీవ్‌కుమార్‌ల ప్రశ్నకు ఆమె లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

సీఆర్‌ఐవైఎన్‌ ఏర్పాటు ప్రతిపాదన లేదు

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో సెంట్రల్‌ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ యోగా, న్యాచురోపతి (సీఆర్‌ఐవైఎన్‌) ఏర్పాటు ప్రతిపాదన ఏదీలేదని కేంద్ర ఆయుష్‌ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్‌ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు బెల్లాన చంద్రశేఖర్‌ ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

ఏపీలో 12 సఖి నివాస్‌లు

ఆంధ్రప్రదేశ్‌లో వర్కింగ్‌ ఉమెన్‌ నిమిత్తం 12 సఖి నివాస్‌లు పనిచేస్తున్నాయని కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. 2019–20లో 1.46 కోట్లు విడుదల చేశామని వైఎస్సార్‌సీపీ సభ్యుడు ఎన్‌. రెడ్డెప్ప ప్రశ్నకు ఆమె లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

డీఎంఎఫ్‌ ఏర్పాటు ప్రతిపాదన ఉంది

రక్షణ బలగాల ఆధునికీకరణ నిమిత్తం డిఫెన్స్‌ మోడరనైజేషన్‌ ఫండ్‌ (డీఎంఎఫ్‌) ఏర్పాటు ప్రతిపాదన ఉందని రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్‌ భట్‌ తెలిపారు. ఆర్థిక మంత్రిత్వశాఖతో సంప్రదింపులు చేసి ఫండ్‌ అమలుచేయడానికి తగిన యంత్రాంగం రూపొందిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ సభ్యుడు బాలశౌరి ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

రైల్వే అండర్‌బ్రిడ్జిలు నిర్మించండి
కేంద్రమంత్రి వైష్ణవ్‌కు ఎంపీ సత్యవతి విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ : అనకాపల్లి నియోజకవర్గంలోని మూలపేట నుంచి సత్యనారాయణపురం, లంకెలపాలెం సమీప రైల్వే లెవెల్‌ క్రాసింగ్‌ల వద్ద రైల్వే అండర్‌ బ్రిడ్జిలు నిర్మించాలని రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌కు వైఎస్సార్‌సీపీ ఎంపీ బీవీ సత్యవతి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రితో శుక్రవారం భేటీ అయిన ఎంపీ సత్యవతి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఆయా అండర్‌ బ్రిడ్జిల నిర్మాణం ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంటోందని ప్రజల ఇబ్బందులు గమనించి త్వరగా పూర్తిచేయాలని కోరారు. దక్షిణ కోస్తా రైల్వేజోన్‌ పనులు వేగవంతం చేయాలని కూడా కేంద్రమంత్రికి ఎంపీ సత్యవతి విజ్ఞప్తి చేశారు.

అంబేడ్కర్‌ స్మృతివనం పనుల వేగం పెంచండి



అంబేడ్కర్‌ స్మృతివనం నిర్మాణ పనులను సమీక్షిస్తున్న మంత్రులు ఆదిమూలపు, బొత్స, మేరుగు, కొట్టు

సాక్షి, అమరావతి: సమన్వయంతో పని చేసి అంబేడ్కర్‌ స్మృతివనం పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను మంత్రుల కమిటీ ఆదేశించింది. శుక్రవారం సచివాలయంలో అంబేడ్కర్‌ విగ్రహ నిర్మాణ కమిటీ చైర్మన్‌, మంత్రి మేరుగు నాగార్జున, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్‌ సమీక్ష నిర్వహించారు. పురపాలక శాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరీ శ్రీలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి జయలక్ష్మి స్మృతివనం పనుల పురోగతిని మంత్రులకు వివరించారు. ఈ సందర్భంగా మేరుగు నాగార్జున మాట్లాడుతూ.. పనుల్లో ఎక్కడా లోపాలు జరగకుండా.. సీఎం జగన్‌ సూచనల ప్రకారం స్మృతివనాన్ని తీర్చిదిద్దాలని ఆదేశించారు. 125 అడుగుల అంబేడ్కర్‌ విగ్రహ నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఢిల్లీలో ఇప్పటికే సిద్ధమైన విగ్రహం విడి భాగాలను రాష్ట్రానికి త్వరగా తెప్పించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్మృతివనంలో అంబేడ్కర్‌ జీవిత విశేషాలను తెలియజేసే శిల్పాలు, గ్రంథాలయంతో పాటు సందర్శకులకు అవసరమైన సౌకర్యాలను వేగంగా ఏర్పాటు చేయాలన్నారు. మ్యూజికల్‌ వాటర్‌ ఫౌంటెన్లు ఏర్పాటు చేయాలని, చుట్టూ ఉండే ఫుట్‌పాత్‌ను కూడా సీఎం సూచించిన విధంగా అందంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అధికారులు కె.హర్షవర్ధన్‌, అదితి సింగ్‌, నరసింహారావు, కేపీసీ ప్రాజెక్ట్స్‌ డైరెక్టర్‌ వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో బహుజనుల సంక్షేమానికి పెద్దపీట

901వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: బడ్జెట్‌లో బహుజనుల సంక్షేమానికి పెద్దపీట వేసిన సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డికి తాము ఎప్పటికీ రుణపడి ఉంటామని, కులవాదంతో అధికారం కోసం వెంపర్లాడుతున్న బాబు అండ్‌ కో ఆటలు సాగవని గుర్తుంచుకుని మసలుకోవాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్‌ యాక్సిస్‌ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 901వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పలువురు మాట్లాడారు. బహుజనులకు ఆర్థికంగా అండగా నిలుస్తూ సంక్షేమం, అభివృద్ధిని చేరువ చేస్తున్న ప్రభుత్వ చర్యలను చూసి కులవాదులకు అక్కసు పెరుగుతుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా పేదలకు 30 లక్షలకు పైగా ఇళ్ల స్థలాలు మంజూరు చేసి గూడు కల్పించిన జగనన్న చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని చెప్పారు. అమరావతి పేరుతో 29 గ్రామాల్లో కులవాదులు చేస్తున్న పెట్టుబడి ఉద్యమం పూర్తిగా ముగిసిందని తెలిపారు. యువగళం పేరుతో అజ్ఞాని లోకేశ్‌ను చంద్రబాబు ప్రజల్లోకి పంపాడన్నారు. బాబు ఇకనైనా తప్పుడు యత్నాలు మానుకోకపోతే రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఇందుపల్లి సుభాషిణి, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

కాపు సంక్షేమ సేన రాష్ట్ర ఆర్గనైజింగ్‌ కార్యదర్శి శ్రీకాంత్‌ రాజీనామా

- వైఎస్సార్‌సీపీలో చేరిక
- బడ్జెట్‌లో కాపు సంక్షేమానికి రూ.4,887 కోట్ల కేటాయింపు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు
- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

సాక్షి, అమరావతి : కాపు సంక్షేమ సేన రాష్ట్ర ఆర్గనైజింగ్‌ కార్యదర్శి పెన్నేరు శ్రీకాంత్‌ శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను కాపు సంక్షేమ సేన రాష్ట్ర అధ్యక్షుడు చేగొండి హరిరామ జోగయ్యకు పంపినట్టు శ్రీకాంత్‌ ప్రకటించారు. ఏపీ కాపు సంక్షేమ అభివృద్ధి సంస్థ(కార్పొరేషన్‌) చైర్మన్‌ అడపా శేషగిరి సమక్షంలో వంద మంది అనుచరులతో శ్రీకాంత్‌ వైఎస్సార్‌సీపీలో చేరారు. కాపుల అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న సీఎం జగన్‌కు మద్దతుగా నిలవాలన్న ఉద్దేశంతో తాను వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్టు చెప్పారు. కాపు సంక్షేమానికి 2023–24 బడ్జెట్‌లో రూ.4,887 కోట్లు కేటాయించి కాపుల మేలుకు చర్యలు చేపడుతున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు చెబుతూ ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఏపీ కాపు కార్పొరేషన్‌ ప్రధాన కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో అడపా శేషగిరి మాట్లాడారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాపు కార్పొరేషన్‌ చైర్మన్‌ అడపా శేషు

స్థానిక వార్తలు

లారీ ఢీకొని వ్యక్తి మృతి

మలికిపురం: మండలంలోని శంకరగుప్తంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన గెడ్డం నాగేశ్వరరావు (62) మృతి చెందాడు. స్కూటీపై వెళ్తున్న నాగేశ్వరరావును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నాగేశ్వరరావు భార్య ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉన్నారు. వారి కుమార్తె, కుమారుడికి పెళ్లిళ్లయ్యాయి. కుమారుడు రమేష్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపారు.

'రామరాజ్యం' పాలకుల ప్రమాణ స్వీకారం

నల్లజర్ల: రామరాజ్యం ధార్మిక సంస్థ మండల పాలకులుగా కొత్తపల్లి సుబ్బారావు (ద్వారకాతిరుమల), ఆచంట రాంబాబు (దేవరపల్లి) ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే గ్రామ పాలకులుగా మేణ్ణి వేణు (నల్లజర్ల), బదిరెడ్డి నాగేశ్వరరావు (ఆవపాడు), మైనం వెంకట బ్రహ్మయ్య (జగన్నాథపురం), ఐనంపూడి రత్నాజీ (ముసుళ్ళగుంట), చింతా శ్రీను (తెలికిచెర్ల), ఉన్నమట్ల శ్రీను (గుండేపల్లి), కలగర భానుచంద్రశేఖర్‌ (ప్రకాశరావుపాలెం), బేతిన రాంబాబు (కవులూరు), జెట్టి రామకృష్ణ (మారెళ్ళమూడి) ప్రమాణ స్వీకారం చేశారు. నల్లజర్ల వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం రామరాజ్య ధార్మిక సంస్థ నియోజకవర్గ స్థాపకుడు మామిడి అశోక్‌కుమార్‌ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, యలమాటి శ్రీను, నిమ్మలపూడి ప్రసాద్‌, బొమ్మిరెడ్డి గాంధీ, గుంటుముక్కల రామకృష్ణ, గుదే వెంకట సుబ్బారావు, కొయ్యలమూడి ప్రసాద్‌ పాల్గొన్నారు. వీరందరూ గ్రామాల్లో ఆధ్యాత్మిక భావాలు పెంపొందించే కార్యక్రమాలు నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.

150 కిలోలకు మించిన బేళ్లు నో సేల్‌

దేవరపల్లి: ప్రస్తుత సీజన్‌లో రైతులు పండించిన ఎన్‌ఎల్‌ఎస్‌ పొగాకు కొనుగోళ్లను ఈ నెల 23 నుంచి ప్రారంభిస్తున్నందున రైతులు సహకరించాలని పొగాకు బోర్డు రీజినల్‌ మేనేజరు జీఎల్‌కే ప్రసాద్‌ కోరారు. పొగాకు వేలం నిర్వహణపై స్థానిక వేలం కేంద్రం వద్ద శుక్రవారం రైతులతో ఆయన సమావేశమయ్యారు. ఆర్‌ఎం ప్రసాద్‌ మాట్లాడుతూ ఈ ఏడాది వేలం కేంద్రాల వద్ద పొగాకు బేళ్లు కాటా విధానంలో మార్పులు చేశామన్నారు. కొత్త వేయింగ్‌ యంత్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రైతులు పొగాకు బేళ్లను 150 కిలోలకు మించకుండా తయారు చేసుకుని వేలం కేంద్రానికి తీసుకురావాలన్నారు.అంతకు మించి బరువున్న బేళ్లను నో సేల్‌గా పరిగణిస్తామన్నారు. రైతులు తమ ఇళ్ల వద్ద గ్రేడుల వారీగా బేళ్లు తయారు చేసుకోవాలని తెలిపారు. వేలం కేంద్రంలో కొనుగోలు చేయని బేళ్లను ఏరోజుకారోజు రైతులు ఇంటికి తీసుకు వెళ్లాలని రైతులు సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించినట్టు ఆర్‌ఎం జీఎల్‌కే ప్రసాద్‌ తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్‌ గ్రేడింగ్‌ అధికారి శివకుమార్‌, రైతు సంఘం అధ్యక్షులు కరుటూరి శ్రీనివాస్‌, రైతులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో ఇటుక పరిశ్రమ కుదేలు



తడిసి ముద్దయిన పచ్చి ఇటుకలు

పెరవలి: అకాల వర్షం ఇటుక తయారీదారులను నిలువునా ముంచేసింది. ముమ్మరంగా ఇటుక తయారీ జరుగుతున్నపుడు ఊహించని విధంగా వర్షం కురవడంతో పనులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దాంతో పాటు ఇప్పటి వరకూ తయారైన పచ్చి ఇటుకలు తడిసి ముద్దయ్యాయి. గురువారం ఆకాశం మేఘావృతమై సాయంత్రం చినుకులు పడ్డాయి. మార్చి నెల కదా వర్షం రాదులే అన్న ధీమాతో ఇటుక బట్టీల నిర్వాహకులు పెద్దగా పట్టించుకోలేదు. హఠాత్తుగా శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిలేకుండా వర్షం కురవటంతో కళ్లంలో ఉన్న పచ్చి ఇటుకలు తడిచి పోయాయి. దీంతో తయారీదారులకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. నిడదవోలు నియోజకవర్గంలో ఇటుక బట్టీలపై ఆధారపడి 500 కుటుంబాలు వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నాయి. సుమారు 15 వేల మంది ఈ పరిశ్రమలపై ఆధారపడి ఉపాధి పొందుతున్నారు.

పెరవలి మండలంలో 86 బట్టీలు ఉండగా రోజూ వాటి నుంచి 10 లక్షల ఇటుకలు తీస్తుంటారు. ప్రస్తుతం కళ్లాల్లో గురువారం సాయంత్రానికి 10 లక్షల వరకూ కొత్త ఇటుకలను తీశారు. అంతక్రితం కళ్లాల్లో మరో 10 లక్షల ఇటుక సిద్ధంగా ఉంది. ఇవన్నీ కూడా తడిచి ముద్దవడంతో ఈ ఇటుక బట్టీల యజమానులు గగ్గోలు పెడుతున్నారు. లక్షలాది రూపాయలు అప్పులు చేసి ఈ పరిశ్రమను కొనసాగిస్తుంటే ప్రకృతి కన్నెర్రతో నష్టపోవాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చిరకాల స్వప్నం.. త్వరలో సాకారం

- ఊడిమూడిలంక వంతెనకు అన్ని అనుమతులూ పూర్తి
- ఇక శంకుస్థాపనే తరువాయి
- లంక గ్రామాల ప్రజల హర్షం
- సీఎం జగన్‌ మాట నిలబెట్టుకున్నారంటూ ఆనందం



అన్నా.. వంతెన నిర్మించరూ..: జి.పెదపూడిలంకలో సీఎం జగన్‌కు అక్కచెల్లెమ్మల విన్నపం (ఫైల్‌)

పి.గన్నవరం: లంక గ్రామాల చిరకాల స్వప్నం త్వరలోనే సాకారం కానుంది. ఊడిమూడిలంక వంతెన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని అనుమతులూ ఇచ్చింది. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చారంటే, తు.చ. తప్పకుండా అమలు చేసి చూపిస్తారనడానికి మరో ఉదాహరణగా నిలిచింది. గోదావరి వరద బాధితులను పరామర్శించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గత ఏడాది ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల్లో పర్యటించారు. ఆ సందర్భంగా అక్కడి ప్రజలకు అవసరమైన వంతెన పనులను త్వరలో ప్రారంభిస్తామని హామీ ఇచ్చిన విషయం విదితమే.

వేలాది మందికి మేలు

పి.గన్నవరం మండల పరిధిలో వశిష్ట గోదావరి నదీ పాయ అవతల ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల్లో సుమారు 3,500 మంది నివసిస్తున్నారు. వరదల సమయంలో మూడు నెలల పాటు వారికి పడవల పైనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి. ఈ నేపథ్యంలో గోదావరి నదిపై వంతెన నిర్మించాలని దశాబ్దాల తరబడి ఇక్కడి ప్రజలు కోరుతున్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఈ సమస్యను సీఎం జగన్‌ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఈ వంతెన నిర్మాణానికి ముఖ్యమంత్రి రూ.49.5 కోట్లు మంజూరు చేశారు. ఆయన ఆదేశాలతో సంబంధిత ఫైలు చకచకా కదిలింది. అధికారులు శరవేగంతో అన్ని అనుమతులూ మంజూరు చేశారు. చివరిగా ఈ వంతెన నిర్మాణానికి పంచాయతీరాజ్‌ ఇంజినీర్‌ ఇన్‌ చీఫ్‌ బాలు నాయక్‌ ఆమోదముద్ర వేశారు. ఈ వంతెన నిర్మాణానికి ఇక శంకుస్థాపనే తరువాయి. దీంతో ఆయా లంక గ్రామాల ప్రజల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.

320 మీటర్ల పొడవున..

వశిష్ట నదీపాయపై 320 మీటర్ల పొడవున 7.5 మీటర్ల వెడల్పున వంతెన నిర్మిస్తామని పంచాయతీరాజ్‌ ప్రాజెక్టు డీఈ అన్యం రాంబాబు తెలిపారు. రెండు అబెట్‌మెంట్‌ వాల్స్‌ సహా, ఏడు పిల్లర్లతో వంతెన నిర్మాణం జరుగుతుందన్నారు. దీనికి ముందు ప్రధాన పంట కాలువపై కూడా వంతెన నిర్మిస్తామన్నారు. పంట కాలువ నుంచి 1.5 కిలో మీటర్ల మేర అప్రోచ్‌ రోడ్డు నిర్మిస్తారని వివరించారు. చెన్నై ఐఐటీ నిపుణుల సూచన మేరకు వంతెన నిర్మాణం జరుగుతుందని చెప్పారు. తాను ఏఈగా ఉన్నప్పటి నుంచి దశాబ్ద కాలంగా ఈ వంతెన కోసం ప్రయత్నిస్తున్నానని.. చివరికి డీఈగా పని చేస్తుండగా సీఎం జగన్‌ చొరవతో వంతెన పనులు ప్రారంభం కానుండటం ఎంతో ఆనందంగా ఉందని రాంబాబు ఆనందం వ్యక్తం చేశారు. వంతెనకు అన్ని అనుమతులూ ఇచ్చిన సీఎం జగన్‌కు లంక గ్రామాల ప్రజలతో పాటు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కృతజ్ఞతలు తెలిపారు.



త్వరలో ఈ కష్టాలకు చెల్లు: బూరుగులంక రేవులో పడవపై ప్రయాణిస్తున్న లంక గ్రామాల ప్రజలు (ఫైల్‌)

యూ.. హు..

- పాఠశాలల్లో ఆత్మరక్షణ పాఠాలు
- 8, 9 తరగతుల విద్యార్థినులకు కరాటేలో శిక్షణ
- 1.23 లక్షల మందికి ప్రయోజనం

రాయవరం: విద్యకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, విద్యార్థినుల రక్షణకు కూడా ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాయి. ఇందులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా బాలికలకు ఆత్మరక్షణ విద్యను అందుబాటులోకి తీసుకువచ్చాయి. ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), మోడల్‌ స్కూళ్లు, మున్సిపల్‌, సాంఘిక సంక్షేమ, ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల్లో 8, 9 తరగతులు, ఇంటర్మీడియెట్‌ చదువుతున్న విద్యార్థినులకు ఆత్మరక్షణ విద్యను అందిస్తున్నారు. రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్షణ ప్రశిక్షణ్‌ – సెల్ఫ్‌ డిఫెన్స్‌ పేరుతో మార్షల్‌ ఆర్ట్స్‌లో శిక్షణ ఇప్పిస్తున్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలోని బాలికలకు మూడు నెలల పాటు ఆత్మరక్షణ శిక్షణ ఇస్తారు. నెలకు 15 రోజుల పాటు, రోజుకు గంట చొప్పున 15 గంటల పాటు ఈ శిక్షణ ఉంటుంది. గత నెలలో ప్రారంభమైన ఈ శిక్షణ వచ్చే నెలాఖరు వరకూ జరగనుంది. కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన బాలికలకు బండి ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ మార్షల్‌ ఆర్ట్స్‌, డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ జిల్లాలోని విద్యార్థినులకు రూపేష్‌ ఎడ్యుకేషనల్‌ వెల్ఫేర్‌ సొసైటీ శిక్షణ ఇస్తున్నాయి. దీని ద్వారా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 1,092 పాఠశాలల్లో చదువుతున్న 1,23,071 మంది విద్యార్థినులకు మేలు జరగనుంది.

ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు..

ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనే క్రమంలో బాలికలు మనోధైర్యం కోల్పోకుండా మార్షల్‌ ఆర్ట్స్‌ ఎంతో తోడ్పడనున్నాయి. విద్యార్థినులు తమ పరిసరాలపై మరింత అవగాహన కలిగి ఉండటానికి, ఏ సమయంలోనైనా ఊహించని పరిస్థితులను ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉండేందుకు మార్షల్‌ ఆర్ట్స్‌ సహాయపడతాయి. మానసికంగా, మేధోపరంగా, శారీరకంగా దృఢంగా మారడానికి, ఆపద సమయంలో తమను తాము రక్షించుకోవడానికి మార్షల్‌ ఆర్ట్స్‌ శిక్షణలో మెళకువలు నేర్పిస్తారు. పాఠశాలల్లో డ్రాపౌట్‌ రేటును తగ్గించడానికి కూడా ఇవి సహాయపడతాయి.



దంగేరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు కరాటేలో శిక్షణ

ఆత్మస్థైర్యం పెంపొందుతుంది



విద్యార్థినుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు, విపత్కర పరిస్థితుల నుంచి తమను తాము రక్షించుకొనేందుకు కరాటే, తైక్వాండో వంటి మార్షల్‌ ఆర్ట్స్‌ ఎంతో ఉపయోగపడతాయి. ఆత్మరక్షణ పాఠాలు పకడ్బందీగా నేర్పేలా చర్యలు తీసుకుంటున్నాం.

– ఎస్‌.అబ్రహం, డీఈఓ, తూర్పు గోదావరి

విద్యార్థినులకు ఉచితంగా..



సుశిక్షితులైన కోచ్‌ల ద్వారా ఆత్మరక్షణ పాఠాలను ప్రభుత్వం నేర్పిస్తోంది. ఈ ఆత్మరక్షణ తరగతులను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలి.

– ఎం.కమలకుమారి, డీఈఓ, డాక్టర్‌ అంబేడ్కర్‌ కోనసీమ జిల్లా

పర్యవేక్షణ అవసరం



పాఠశాలల్లో ఇస్తున్న మార్షల్‌ ఆర్ట్స్‌ శిక్షణ విద్యార్థినులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ శిక్షణ అమలు తీరును హెచ్‌ఎంలు, పీఈటీలతో పాటు అన్ని స్థాయిల్లో పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

సాక్షి ఫ్యామిలీ
రాజమహేంద్రవరం
శనివారం ॥ 18-3-2023

కుర్రాళ్లు వినరు.
బైక్ ఎక్కి తుర్రుమంటారు.
భర్తలకు నిర్లక్ష్యం.
హెల్మెట్ లేకుండానే బయలుదేరుతారు.
ఇంటి మగవారి అసురక్షిత ప్రయాణం
స్త్రీలకు ఎప్పుడూ ఆందోళనకరమే.
ప్రతి ఇంట్లోని స్త్రీలు
ఆ ఇంటి మగవారికి రాఘవేంద్ర కుమార్‌ను చూపాలి.
స్నేహితుణ్ణి ప్రమాదంలో కోల్పోయిన అతను
సొంత డబ్బుతో ఇప్పటికి 56,000 హెల్మెట్లు పంచాడు.
పురుషులైనా స్త్రీలైనా హెల్మెట్ లేకుండా బండెక్కారంటే
ఇంటి మీదకు ముప్పు తెచ్చినట్టే అంటాడు రాఘవేంద్ర.
అతను చెప్పేది వినండి.


రాఘవేంద్ర

● హెల్మెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా

మీ పిల్లలకు ఇతన్ని చూపండి

'ఒంటి మీద ఎక్కడా దెబ్బ లేదు. తల ఒక్క దానికే తగిలింది' అని అయినవారిని కోల్పోయి ఏడ్చేవారు ఎందరో ఉన్నారు. ఆ తలకు దెబ్బ తగలని రీతిలో జాగ్రత్త తీసుకుని ఉంటే వారంతా బతికేవారు. హెల్మెట్ వాడితే బతికేవారు.

చట్టాలు ఎన్ని చెప్పినా, నిబంధనలు విధించినా జీవితాన్ని సీరియస్‌గా తీసుకోని వారు ఎప్పుడూ ఉంటారు. వారు ఎక్కడో వేరే కుటుంబాలలో ఉంటారనుకోవద్దు. మన కుటుంబాల్లో కూడా ఉంటారు. కాలేజీకి వచ్చిన కొడుకు, ఉద్యోగానికి వెళ్లే భర్త, ట్రయినింగ్‌లో ఉన్న కూతురు.. వీరు కూడా 'ఆ.. ఏముందిలే' అనుకుని హెల్మెట్ వాడకుండా ఉండొచ్చు.

అలాంటి వారు తన కంట పడితే ఊరుకోడు రాఘవేంద్ర కుమార్ (36). ఇతణ్ణి అందరూ ఇప్పుడు 'హెల్మెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా' అంటారు. నోయిడాలో నివాసం ఉండే ఇతను ఉద్యోగం వదిలేశాడు. ఇతర పనులు మానేశాడు. కేవలం హెల్మెట్‌కు సంబంధించిన చైతన్యం కోసం పని చేస్తున్నాడు. అతడు రోజూ చేసే పని కారు వేసుకుని, అందులో కొన్ని హెల్మెట్లు పడేసుకుని నోయిడా ఆగ్రాల మధ్య ఉండే ఆరు లేన్ల యమునా ఎక్స్‌ప్రెస్‌కు చేరుకుంటాడు. ఆ దారి మీద బైక్ వేసుకుని హెల్మెట్ లేకుండా ఎవరైనా వెళుతుంటే వారిని వెంబడించి ఆపుతాడు. హెల్మెట్ వాడకపోతే ఉండే ప్రమాదం గురించి చెప్పి ఉచితంగా హెల్మెట్ ఇచ్చి పంపుతాడు.

'2014 నుంచి నుంచి నేను హెల్మెట్‌లు పంచుతున్నాను. ఇప్పటికి 56 వేల హెల్మెట్లు పంచాను. నేను పంచిన రోజునో ఆ తర్వాత ఐదారు రోజుల్లోనో ప్రమాదానికి గురై నేనిచ్చిన హెల్మెట్ వల్ల ప్రాణాలు కాపాడుకున్న వారు 30 మంది ఉన్నారు. వారంతా ఎంతో సంతోషంతో కృతజ్ఞతతో నాకు ఫోన్ చేసి తాము ప్రాణాలతో ఉండటానికి కారణం నేనేనని చెబుతారు. చాలామందికి భారీ యాక్సిడెంట్లు అయ్యి కాళ్లు చేతులు విరిగినా తల మాత్రం ఏమీ కాకపోవడంతో బతికిపోయారు' అంటాడు రాఘవేంద్ర కుమార్.

అయితే అతనికి కూడా హెల్మెట్ విలువ ప్రాణ స్నేహితుడు మరణించాకే తెలిసింది. బిహార్‌కు చెందిన రాఘవేంద్ర కుమార్ 2009లో నోయిడా వచ్చి లా కోర్సులో



చేరాడు. అదే బిహార్ నుంచి ఇంజినీరింగ్ చేయడానికి వచ్చి కృష్ణకుమార్ అతని రూమ్మేట్ అయ్యారు. ఇద్దరూ ప్రాణ స్నేహితులు అయ్యారు. కాని 2014లో కొత్తగా వేసిన యమున ఎక్స్‌ప్రెస్ వే మీద హెల్మెట్ లేకుండా వెళుతూ కృష్ణకుమార్ యాక్సిడెంట్‌కు లోనయ్యాడు. ఒంటి మీద ఒక్క దెబ్బ లేదు. తలకే తగిలింది. మరణించాడు. ' వాళ్లింట్లో వాళ్లకి నా స్నేహితుడు ఒక్కగానొక్క కొడుకు కావడంతో వాడి అమ్మానాన్నల గుండెలు పగిలిపోయాయి. హెల్మెట్ ఉంటే బతికేవాడు కదా అన్న బాధ ఇప్పటికీ వదల్లేదు నన్ను' అంటాడు రాఘవేంద్ర.

అప్పటి నుంచి అతడు ఒక ఉద్యమంగా హెల్మెట్లు పంచుతున్నాడు. భార్య కొత్తల్లో సహకరించింది. కాని రాఘవేంద్ర కుమార్ దాదాపు తన ఆస్తులన్నీ అమ్మి ఇప్పటికి రెండు కోట్ల వరకు ఖర్చు చేసి హెల్మెట్లు పంచాడు. 'ఉన్నదంతా ఊడ్చేశాను. పర్వాలేదు. బిహార్‌లోని నా సొంత పల్లెకు వెళ్లిపోతాను' అని ఇటీవల అతను ప్రకటించాడు.

కాని అది పైమాటే. తనకు సరైన ప్రోత్సాహం లభిస్తే దేశంలో హెల్మెట్ల బ్యాంకులు తెరవాలని ఎవరైనా సరే అరువు తీసుకుని వెళ్లి వాడుకునేలా హెల్మెట్లు అందుబాటులో ఉంచాలని అతని కోరిక. '4 ఏళ్లు పైబడిన పిల్లలకు హెల్మెట్లు తప్పనిసరి చేయాలని నేను సుప్రీం కోర్టులో పిల్ వేశాను. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కూడా కలిశాను' అంటాడు రాఘవేంద్ర. 'ప్రాణం పోతే ఏం చేసినా తిరిగి రాదు' అంటాడు.

హెల్మెట్‌ను వాడటానికి ఇష్టపడని ప్రతి ఒక్కరికి రాఘవేంద్ర చెబుతున్న విషయం అర్థం కావాలి. ప్రాణం ఉంటే లోకం ఉంటుంది.

హ్యాపీ పేరెంటింగ్

వసపిట్ట పాఠాలు


కృష్ణమాధురి



తల్లిదండ్రులుగా పిల్లలను చూసుకోవాల్సిన విధానాన్ని, తల్లిగా తన అనుభవాన్ని కళ్లకు కడుతూ యూ ట్యూబర్‌గా రాణిస్తోంది హైదరాబాద్ కొండాపూర్‌లో ఉంటున్న చిలుకూరి కృష్ణ మాధురి, నాలుగు, ఏడాదిన్నర వయసున్న పిల్లలతో కలిసి, తన స్వీయ అనుభవాలను షేర్ చేస్తుంటుంది. మాధురి మూడేళ్లుగా చేస్తున్న ఈ ప్రయత్నాలు... పిల్లల పెంపకంలో తను తీసుకునే జాగ్రత్తలు ఎంతోమంది తల్లులకు పాఠాలు అవుతున్నాయి. ఈ విషయాల గురించి మాధురి మాట్లాడుతూ ...

''నేను పుట్టి పెరిగింది రాజమండ్రిలో. మావారిది గుంటూరు. మా వారి ఉద్యోగరీత్యా బెంగళూరులో ఉండేవాళ్లం. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా ఉన్న నేను పిల్లల పుట్టడంతో ఇంటి దగ్గరే ఉండిపోయాను. పిల్లలపై తపన, వారి ఆరోగ్య జాగ్రత్తలు, పెంపకం విషయాలన్నీ తల్లిగా నాకు ప్రతిరోజూ ఓ పాఠమే. వీటిని నలుగురితో పంచుకుంటే కొంత మంది తల్లులకైనా ఉపయోగపడుతుంది కదా అని సరదాగా వీడియోలు తీసి, యూ ట్యూబ్‌లో పోస్ట్ చేసేదాన్ని.

వాయిస్ ఆఫ్ వసపిట్ట

పిల్లల అల్లరి మాటలకు పెద్దవాళ్లు ముద్దుగా పెట్టే పేరు వసపిట్ట. నలుగురిలో ప్రత్యేకంగా ఉండాలని చిన్నప్పటి నుంచి కాస్త ఎక్కువగా మాట్లాడేదాన్ని. అందుకే, అందరూ నన్ను వసపిట్ట అని పిలిచేవారు. దీంతో ఛానెల్‌కి ఇదే పేరు బాగుంటుందని ఎంచుకున్నాను. మూడేళ్లు అవుతోంది ఇది స్టార్ట్ చేసి. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వచ్చాక నా పోస్టులు మరిన్ని పెరిగాయి.

పెంపకాన్ని పరిచయం చేస్తూ..

అమ్మ తన పిల్లలను ఏ విధంగా పెంచుతుందనే విషయాల గురించి వెతికితే తెలుగులో ఎక్కువ బ్లాగర్స్ లేరు. ఉన్నా, వివరంగా చెప్పేవారు లేరు. పిల్లల పెంపకం అనగానే చాలా వరకు డాక్టర్లు, డైటీషియన్లు కనిపిస్తారు. వాళ్లు చెప్పేవి అందరూ ఆచరణలో పెడుతున్నారో లేదో తెలియదు. నేను డాక్టర్ దగ్గరకు పిల్లలను తీసుకెళ్లినప్పుడు, అక్కడ వారిచ్చిన మందులు, జాగ్రత్తల నుంచి అన్నీ నా ఛానెల్ ద్వారా పరిచయం చేస్తుంటాను.

రోజువారి పనులు

చిన్న పిల్లలున్న ఇల్లు ఎలా ఉంటుందో తల్లులందరికీ అనుభవమే. ఇల్లు పీకి పందిరేస్తారు అంటుంటారు. ఇలాంటప్పుడు చిన్నపిల్లలకు క్రమశిక్షణ ఎలా అలవాటు చేయాలి, దుమ్ము, కాలుష్యం నుంచి వారిని ఎలా కాపాడాలి, టీవీ చూడకుండా తినడం ఎలా అలవాటు చేయాలి, స్క్రీన్ టైమ్ ఎందుకు తగ్గించాలి.. ఇలాంటివి పిల్లలను ఇన్‌వాల్వ్ చేసి చెప్పడం వల్ల చాలా మంది కనెక్ట్ అయ్యారు. అంతేకాదు, వాళ్లంతట వాళ్లు పనులు చేసుకోవడం, వంటలో సాయం చేయడం.. వంటివి పిల్లలకు పెద్దవాళ్లు అలవాటు చేయాలి. వీటిని మా పిల్లలను చూపిస్తూ 'హ్యాపీ పేరెంటింగ్' అనేది తెలియజేయాలనుకున్నాను. అదే చేస్తున్నాను.

ఆనందకరమైన లక్ష్యం

మదర్ హుడ్, ఫాదర్ హుడ్ ఎంజాయ్ చేస్తూ పిల్లలు కూడా మంచి ఫీలింగ్‌తో పెరగాలనేది నా ఆలోచన. మేం సమస్యలను ఎలా అధిగమిస్తున్నామో కూడా చూపిస్తున్నాను. వీటిని చూడటానికి నాలుగు లక్షలకు పైగా వీక్షకులున్నారు. వీరిలో పిల్లలున్నవారు 70 శాతం మంది ఉన్నారు. నా వీడియోలు చూసి తాము కూడా బ్లాగ్స్ చేస్తున్నామని కొందరు చెబుతుంటారు.

ఆరోగ్య జాగ్రత్తలు...

వీక్షకులలో చాలా మంది డాక్టరు చెప్పే జాగ్రత్తలు, కిడ్స్ ఫుడ్ గురించి సలహాలు సూచనలు అడుగుతుంటారు. పిల్లలు సరిగా తినరు అనేది పెద్దలు ప్రతిసారి చెబుతుంటారు. కానీ, ఎందుకు తినరు, ఎలా తింటారు.. అనే వివరాలను మా పిల్లలను ఉదాహరణగా చూపిస్తూ వివరిస్తుంటాను. వివిధ సమయాలలో పిల్లల ప్రవర్తన, మనం వారితో మాట్లాడటం, ప్రాక్టికల్‌గా చేస్తూ చెబుతుంటాను. పిల్లలు కూడా ఈ విధానాన్ని బాగా ఇష్టపడుతున్నారు. మా పిల్లలకు ఓ సారి ర్యాషెష్ వచ్చాయి. వాటిని ప్రాక్టికల్‌గా చూపించి, డాక్టరు చెప్పిన సూచనలతో పాటు, నేను స్వయంగా ఎలాంటి కేర్ తీసుకుంటున్నానో చూపించాను. అలాగే.. డెంటల్ ట్రీట్‌మెంట్, గర్భిణిగా ఉన్నప్పుడు, తల్లిపాల ప్రాముఖ్యత.. ఆ సమయాల్లో నేనెలాంటి జాగ్రత్తలు తీసుకున్నాను.. మరికొన్ని ఇతరుల ద్వారా సేకరించిన సూచనలూ ఇస్తుంటాను. మా నాన్న రైల్వేలో ఉద్యోగి. చిన్నప్పటి నుంచి కుటుంబంలో ప్రతి విషయంలో నా అభిప్రాయాన్ని కూడా అడిగేవారు. అలా వారి నుంచే నాకు నా పిల్లల పెంపకాన్ని మరింతగా నలుగురికి తెలియజేయాలనే ఆలోచన పెరుగుతూ వచ్చింది'' అని తల్లిగా తన అనుభవ పాఠాలను ఆనందంగా వివరించారు మాధురి.

– నిర్మలారెడ్డి

బ్యూటిప్స్





● టేబుల్ స్పూన్ పెసలను రాత్రంతా నానబెట్టి ఉదయం మెత్తగా గ్రైండ్ చేసి అందులో అర టీ స్పూన్ నెయ్యి లేదా పాలు వేసి కలిపి ముఖానికి పట్టించి మర్దన చేసి పది నిమిషాల సేపు మిశ్రమాన్ని ముఖం మీద ఉంచాలి. ఈ ప్యాక్ పూర్తిగా ఆరిన తర్వాత గోరువెచ్చటి నీటితో కడగాలి. ఇలా చేస్తే పొడిబారిన చర్మం ఆరోగ్యంగా, నునుపుగా మారుతుంది. ఆయిల్ స్కిన్ వాళ్లయితే పెసర పేస్ట్‌లో కొద్దిగా మజ్జిగ లేదా పన్నీరు కలుపుకోవాలి.

● ఎండకు కమిలిపోయిన చర్మం తిరిగి మామూలు కావాలంటే... పైన చెప్పుకున్న పెసల పేస్టులో చల్లటి పెరుగు లేదా కలబంద పేస్టు కలిపి ముఖానికి, చేతులకు, పాదాలకు పట్టించి ఐదు నిమిషాల సేపు మర్దన చేయాలి. ఆరిపోయిన తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేయాలి.

● హెయిర్ ఫాల్ తగ్గాలంటే... రాత్రంతా నానబెట్టిన పెసలను గ్రైండ్ చేసి అందులో కోడిగుడ్డు సొన, టేబుల్ స్పూన్ నిమ్మరసం, కప్పు పెరుగు కలిపి చిక్కటి పేస్టు చేయాలి. ఈ మిశ్రమాన్ని జుట్టు కుదుళ్లకు పట్టించి 15నిమిషాల తర్వాత తలస్నానం చేయాలి. ఈ మూంగ్‌దాల్ ప్యాక్‌ను నూనె రాసిన జుట్టుకు పట్టించకూడదు. షాంపూతో తలస్నానం చేసి ఆరిన తర్వాత మాత్రమే వేయాలి.

● 'ఆడపిల్ల'కు స్వాగతం

మా ఇంటి మహాలక్ష్మి

ఆడపిల్లపుట్టిందని సంబరం చేశారు.
ఇంట్లోకి పూలతో రహదారి పరిచారు.
చిట్టి పాదాల పారాణి ముద్రలు వేశారు.
అమ్మాయి పుడితే ఇలా స్వాగతం పలకండి.


పాపాయితో అమ్మానాన్నలు సంహిత, సాయికిరణ్


నట్టింట పాదముద్రలు వేయిస్తూ...

పాపాయిని ఎత్తుకున్న నానమ్మ


'ఆడదే ఆధారం... మన కథ ఆడనే ఆరంభం...' అంటూ పాడుకునే నేల మనది. ఆడపిల్ల పుట్టగానే గొంతులో వడ్ల గింజలు వేసిన నేల కూడా ఇది. తల్లి గర్భంలోనే శిశువును గుర్తించి పుట్టకముందే ప్రాణం తీస్తున్న పాపాలకూ కొదవ లేదు. ఇక ఆడపిల్లను కన్నతల్లికి ఎదురయ్యే కష్టాలను ఎంత చెప్పుకున్నా తక్కువే. ఆడపిల్ల పుట్టింది... అనగానే కోడలిపై చిర్రుబుర్రులాడే అత్తలు, భార్య–బిడ్డల ముఖం చూడని మగవాళ్లు ఉన్న సమాజం మనది. ఇన్ని దారుణాల మధ్య ఓ సంతోషవీచిక వెల్లివిరిసింది. పుట్టింది ఆడపిల్ల అని తెలియనే పండుగ చేసుకున్నారు. ఊరూ వాడా అందరినీ పిలిచి వేడుక చేసుకున్నారు. అమ్మమ్మగారింట్లో రెండు నెలలు పూర్తి చేసుకున్న బిడ్డ మూడవ నెల నానమ్మ దగ్గరకు ప్రయాణమైంది. ఆ బిడ్డనెత్తుకుని అత్తగారింటికి వచ్చిన తల్లికి పూలబాట పరిచారు అత్తింటివాళ్లు. పాపకు ఘన స్వాగతం పలికారు. ఆడబిడ్డ పుట్టడం అంటే ఇంట్లోకి లక్ష్మీదేవి రావడమేనన్నారు. ఆదర్శంగా నిలిచిన కుటుంబం తెలంగాణ, మహబూబాబాద్ జిల్లాలో ఉంది. కేసముద్రం మండలం, తాళ్లపూసపల్లి గ్రామానికి చెందిన పొడగంటి శ్రీనివాసాచారి, భద్రకాళి దంపతుల ఆదర్శవంతమైన ఆత్మీయత ఇది.

పాపాయి కోసం పూజలు

కోడలు గర్భిణి అని తెలియగానే మగ పిల్లవాడు పుట్టాలని అనుకుంటారు. కానీ భద్రకాళి కుటుంబీకులు మాత్రం ఆడపిల్ల కావాలని పూజలు చేశారు. వాళ్ల పెద్దకొడుకు సాయి కిరణ్‌కు సిరిసిల్ల పట్టణానికి చెందిన సంహితతో రెండు సంవత్సరాల క్రితం వివాహమైంది. సంహిత నెలతప్పినప్పటి నుంచి భద్రకాళితోపాటు ఆమె తోడికోడలు సుమ, మరదలు రమ్య కూడా ఆడపిల్లలు పుట్టాలని వ్రతాలు, పూజలు చేశారు. వాళ్లందరికీ మగపిల్లలే. ఈ తరంలోనైనా ఇంట్లో ఆడపిల్ల కావాలని వాళ్ల కోరిక. ప్రసవం రోజు వరంగల్‌లో ఆసుపత్రికి ఇంటిల్లిపాది తరలి వెళ్లారు. ఆడపిల్ల పుట్టిందని తెలియగానే సంతోషంగా కేకలు వేస్తూ, హాస్పిటల్‌లో అందరికీ స్వీట్లు పంచిపెట్టారు.

అపూర్వ స్వాగతం

కోడలు పుట్టింటికి వచ్చిన రోజు ఇంటిని పూలతో అలంకరించారు. ముత్తయిదువలతో స్వాగతం పలికారు. చిన్నపాప కాళ్లకు పారాణి రాసి తొలి అడుగుల గుర్తులు నట్టింట్లో ముద్రించుకున్నారు. ఆ అడుగులను కళ్లకు అద్దుకున్నారు. ఆ జ్ఞాపకం కలకాలం నిలిచి ఉండడానికి ఫొటోలు తీశారు.

నా కోరిక తీరింది

నాకు చిన్నప్పటి నుండి ఆడపిల్లలంటే ఇష్టం. మా వారు కూడా ఆడపిల్ల ఉన్న ఇంటి అందమే వేరు అంటూ ఉంటారు. అందుకోసమే మా ఇంటి చుట్టుపక్కల ఉన్న ఆడ పిల్లలను ప్రతి పండుగకు పిలుస్తాం. వారు చేసే సందడి చూసి సంబుర పడుతాం. మా ఇంట్లో ఆడపిల్ల ఉండాలనే కోరిక నెరవేరింది. అందుకోసమే అలా స్వాగతం పలికాం.

- భద్రకాళి,
పాపాయి నానమ్మ

– ఈరగాని భిక్షం,
సాక్షి, మహబూబాబాద్

● కేరెంటింగ్

లాలన... పాలన



ఈ రోజుల్లో పిల్లలు పెద్దలు అనే తేడా లేకుండా అందరూ కూడా ఒత్తిడితో జీవిస్తున్నారు ముఖ్యంగా పెద్దలు డిప్రెషన్ లోకి వెళ్లి ఆత్మహత్య చేసుకుంటున్న నేపథ్యంలో చిన్న పిల్లలు కూడా తీవ్రస్థాయిలో ఈ ఒత్తిడికి గురవుతున్నారు కాబట్టి తల్లిదండ్రులు పిల్లలు పెంచే విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కోసం...

సాధారణంగా ప్రతి తల్లీ తండ్రీ చేసే పొరపాటు ఇతరులతో తతమ పిల్లల్ని పోల్చడం. అలా పోల్చని వాళ్లని వేళ్ళ మీద లెక్క పెట్టచ్చు. పక్కింటి చింటూ చూడు. ఎంత బుద్ధిగా ఉంటాడో, నువ్వే ఇంత అల్లరి చేస్తున్నావు అనో, ఫలానా వాళ్ల పాప చూడు. ఎంత బాగా చదువుతుందో, నువ్వసలు పుస్తకం ముట్టవు అనో... ఇలా మరొకరితో మీ పిల్లలకి పోలిక చెప్పడమంటే వాళ్ళని లెక్కలేకుండా చూడడమేనని, దానివల్ల వారు తమ ప్రవర్తనను మార్చుకోకపోగా, మరింత దూకుడుగా, అల్లరిగా ప్రవర్తిస్తారని చైల్డ్ సైకాలజిస్టులు చెబుతున్నారు. పోల్చి చెప్పడం వల్ల వారిలో అనవసరమైన ఈర్ష్య, అసూయలు పెరుగుతాయనీ, అందుకే పోలికల జోలికి పోకూడదని చెబుతారు.

పెద్దవాళ్ల దగ్గర ఉంచడం మేలు

పిల్లలను ఇంట్లో ఒంటరిగా ఉంచకుండా వారి అమ్మమ్మలు, తాతయ్యలతో కలిపి ఉంచడం మేలు. దీంతో వారు పెద్దల నుంచి ఎన్నో మంచి విషయాలు నేర్చుకుంటారు. ఇక పిల్లల భద్రత గురించి ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

మరేం చేయాలి?

మన బంగారాలని వాళ్లతో వీళ్లతో పోల్చి చెప్పడానికి బదులు మీకు వాళ్ళెంత ప్రత్యేకమో, వాళ్ళంటే ఎంత ఇష్టమో చెప్పండి. మీ పిల్లలు వాళ్ళల్లో వాళ్ళు కూడా ఎలాంటి పోలికలూ పెట్టుకోకుండా చూడటం కూడా ముఖ్యం.

సరదాగా గడపండి

మీకు సమయం దొరికినప్పుడు, పిల్లలతో సరదాగా గడపండి. ఆ సమయంలో మీరు ఉద్యోగాలు చేస్తూ ఎందుకు కష్టపడుతున్నారో పిల్లలకు వివరించండి. దీనివల్ల మీ పిల్లల భావోద్వేగాలు మీకు బాగా తెలుస్తాయి. తద్వారా పిల్లలు కూడా మీకు మద్దతు ఇవ్వడానికి తమ వంతు ప్రయత్నం చేస్తారు. మీరు ఆఫీస్ నుండి తిరిగి వచ్చాక, మీ పిల్లలతో సాధ్యమైనంత ఎక్కువ సమయాన్ని కేటాయించండి. ఇక వారంతాల్లో పూర్తి సమయాన్ని వారికే కేటాయించండి. పిల్లలతో విభిన్న పనులు ప్లాన్ చేయండి. వారికి ఇష్టమైన పనులు, వంటలు చేసి పెట్టండి. పిక్నిక్‌కి, పార్క్‌కి, సినిమాలకు తీసుకెళ్లండి.

బ్రహ్మాస్త్రం వేయకండి

కొంతమంది తల్లిదండ్రులు పిల్లల విషయంలో అతి జాగ్రత్తలు తీసుకుంటూ ఉంటారు ఇది మాత్రం అంత మంచి పద్ధతి కాదు. ఎందుకంటే పిల్లలు తప్పు చేయడం సహజం. అలా తప్పు చేశారన్న కోపంతో వారిని కఠినంగా దండించామనుకోండి, ఆ తప్పును కప్పి పుచ్చడం కోసం ఇంకా అనేక తప్పులు చేస్తారు. అందువల్ల వారు ఏదైనా తప్పు చేసినప్పుడు ఒకటికి రెండుసార్లు ఓపిగ్గా చెప్పి చూడండి. అలా చెప్పినప్పటికీ మారకపోతే అప్పుడు దగ్గర కూర్చోబెట్టుకుని స్వరం పెంచి మాట్లాడండి. అంతే కానీ చిన్న తప్పు చేసినా పిల్లలపై మీ ప్రతాపం చూపించడం వల్ల వారు తీవ్ర అభద్రతా భావానికి లోనవుతారు.

టైమ్ టేబుల్ సెట్ చేయండి...

పిల్లలు ఒక వయసుకు వచ్చిన తర్వాత ఇంట్లో ఒంటరిగా వదిలివెళుతున్నప్పుడు వారికి ఒక నిర్దిష్టమైన టైమ్ టేబుల్‌ను సెట్ చేయాలి. ఎప్పుడు చదవాలి? ఎప్పుడు తినాలి? ఎప్పుడు ఆడుకోవాలి? ఎప్పుడు పడుకోవాలి... తదితర విషయాలకు వారితో మాట్లాడి అన్నిటికీ టైం ఫిక్స్ చేయండి. పిల్లలు కచ్చితంగా ఈ టైం టేబుల్‌ను పాటించేలా చూడండి. ఇక వారి వస్తువులను వారే సర్దిపెట్టుకునేలా, వారి పనులు వారే చేసుకునేలా అలవాటు చేయండి. ఇక ఆఫీసుకు వెళ్లినా ఇంట్లోని పిల్లల పరిస్థితి గురించి అడగడానికి అప్పుడప్పుడు ఫోన్ చేస్తూ ఉండండి.

ప్లే గ్రౌండ్‌కు పంపండి


పిల్లలకు కాసిని మార్కులు తక్కువ వచ్చాయని వారిని వత్తిడి చేయద్దు. ఎందుకంటే కేవలం మార్కుల కోసం చదివే చదువుల వల్ల పిల్లలు అధిక ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ర్యాంక్స్ కోసం ఐదో తరగతి నుంచే ప్లే గ్రౌండ్ కి దూరంగా టాబ్లెట్స్, కంప్యూటర్స్ ముందు కూర్చో పెట్టి కంప్యూటర్ కోడింగ్ సైతం నేర్పిస్తున్నారు. దీనివలన పిల్లల భవిష్యత్తు పై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుంది. పిల్లలు చిన్నప్పటినుంచి ప్లే గ్రౌండ్ లో ఆటలు ఆడుకునే విధంగా ప్రోత్సహించాలి. ప్లే గ్రౌండ్‌లో ఆడుకోకుండా ఇంట్లో కూర్చుని కంప్యూటర్ గేమ్స్ ఆడుకునేలా మాత్రం వారిని ఎంకరేజ్ చేయద్దు. కంప్యూటర్ గేమ్స్ ఎప్పుడైనా ఆడుకుంటే ఫరవాలేదు కానీ, వారికి శారీరక వ్యాయామం, ఉత్సాహం కావాలంటే మాత్రం ఆడుకోవడాన్ని ప్రోత్సహించండి. శారీరకంగా చురుగ్గా ఉంటే మానసికంగా కూడా చురుగ్గా ఉంటారు.

ఇచ్చి పుచ్చుకోవడం నేర్పండి

చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులు పిల్లలకు ఆత్మాభిమానంతో జీవించడం, పెద్దలకు గౌరవం ఇవ్వడం నేర్పించాలి. గౌరవం గానీ, ప్రేమ కానీ మనం ఇతరులకు ఇస్తేనే మనకు తిరిగి వస్తాయని చెప్పాలి. తద్వారా వారు భవిష్యత్తులో తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవడమే కాకుండా సమాజం పట్ల మంచి ప్రేమను కనబరుస్తారు. అదేవిధంగా తోటి పిల్లలతో వ్యత్యాసాలు చూసుకోకుండా సమానంగా నడుచుకునే విధంగా విలువలతో జీవించడం నేర్పాలి. సాధారణంగా చాలామంది పిల్లలు మనం చెప్పే మాటలు వినరు, కానీ మనం చేసేవి చూసి అలానే చేస్తారు. అందువల్ల మన పిల్లల ముందు మన నడవడిక బాగుండాలని గుర్తుంచుకోండి.

● ఆరోగ్యాహారం

ఒత్తిడిని తినేయండి



మానసిక ఆరోగ్యం బాగుండాలంటే కొన్ని రకాల పోషకాలను తప్పకుండా తీసుకోవాలి. దానికి పిల్లలు, పెద్దలు అనేం లేదు. ఈ కింద ఇచ్చిన కొన్ని పదార్థాలలో మానసికంగా చురుగ్గా ఉంచే కొన్ని కారకాలు ఉన్నట్లు పోషకాహార నిపుణులు గుర్తించారు. వాటిని తీసుకోవడం వల్ల ఒత్తిడి తగ్గి చురుగ్గా ఉండగలం. అవేమిటో చూద్దాం.

మానసిక ఆందోళన, ఒత్తిడి, కుంగుబాటు, డిప్రెషన్.. పేరు ఏదైనా వచ్చిన తర్వాత బాధ పడేకంటే రాకుండా చూసుకోవడం చాలా మేలు. ఈ కింద ఇచ్చిన కొన్ని పదార్థాలు తీసుకోండి. శారీరకంగానే కాదు, మానసికంగానూ ఆరోగ్యంగా ఉండండి.

పొద్దుతిరుగుడు గింజలు... వీటిలో విటమిన్ 'ఇ' అధిక స్థాయిలో ఉంటుంది. ఇది మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సమర్థంగా పనిచేస్తుంది.



వెల్లుల్లి... వెల్లుల్లిలో సల్ఫర్ సమ్మేళనాలు అధికంగా ఉంటాయి. ఇవి గ్లటాథియోన్ అనే యాంటీ ఆక్సిడెంట్‌ను ఉత్పత్తిచేస్తాయి. ఇది ఒత్తిడిని ఎదుర్కొనే రక్షణ ఛత్రంలో మొదటి మూలకంగా పనిచేస్తుంది.



గుడ్లు... గుడ్లలో పోషకాలు పుష్కలం అనే విషయం తెలిసిందే. వీటిలో విటమిన్లు, మినరల్స్, అమైనో ఆమ్లాలు, యాంటీ ఆక్సిడెంట్స్ సంతృప్త స్థాయిలో లభిస్తాయి. ప్రత్యేకంగా ఇందులో చోలిన్ అనే పోషకం పుష్కలంగా ఉంటుంది. ఇది మెదడు ఆరోగ్యంగా ఉండేందుకు తోడ్పడుతుందని, అలాగే ఒత్తిడి నివారణకు సమర్థంగా పనిచేస్తుందని వైద్యులు గుర్తించారు.

నువ్వులు... నువ్వులతో తయారుచేసే పదార్థాలలో ఎల్-ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం పాళ్లు ఎక్కువ. ఇది మనసును ఉల్లాసంగా ఉంచే డోపమైన్, సెరటోనిన్ ఉత్పత్తిలో ఉపయోగపడుతుంది. అలాగే ఒత్తిడిని తగ్గించేందుకు తోడ్పడుతుంది. 25 మంది యువకులకు నాలుగు రోజుల పాటు నువ్వుల ఉండలను తినిపించి పరిశీలించినప్పుడు వారిలో ఆందోళన, ఒత్తిడి స్థాయిలు గణనీయంగా తగ్గినట్లు ఓ సర్వేలో తేలింది.



నువ్వులతో రకరకాల స్నాక్స్ తయారు చేసుకోవచ్చు. ఏదైనా పదార్థాన్ని రుచిగా ఉండేలా తయారు చేసుకోవడం వల్ల వాటిని తినే విధంగా మెదడు కూడా మనల్ని ప్రోత్సహిస్తుంది.

రుచికే కాదు.. ఆరోగ్యానికి కూడా...

ఆరోగ్యాన్ని ఇచ్చే పండ్లు అంటే ఎక్కువ మంది యాపిల్ గురించి మాట్లాడతారు. కానీ దానితో సమానంగా దానిమ్మ కూడా ఆరోగ్యాన్ని ఇస్తుందనే విషయం చాలా తక్కువ మందికే తెలుసు. దీనివల్ల బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.

చాట్, స్వీట్ డిష్, ఐస్ క్రీమ్, స్మూతీస్ ఇలా ఏది చేసినా దాని మీద తప్పనిసరిగా గార్నిపింగ్ కోసం దానిమ్మ గింజలను ఉపయోగిస్తారు. ఎందుకంటే ఏదోవిధంగా దానిమ్మను తీసుకోవడం వల్ల ధమనుల్లో కొవ్వు చేరకుండా చేస్తుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని అనుకుంటే తప్పకుండా దానిమ్మ పండ్లు తినడం అలవాటు చేసుకోండి.

దానిమ్మ వల్ల ప్రయోజనాలు



- దానిమ్మ మెదడు ఆరోగ్యానికి చాలా మంచిది. రోగనిరోధక శక్తిని ఇస్తుంది. పోషకాలతో నిండి ఉంటుంది. తక్కువ కేలరీలు, కొవ్వు ఉంటాయి. విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్ పుష్కలంగా ఉన్నాయి.
- యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. వ్యాధులను నిరోధించేందుకు సహాయపడతాయి. వృద్ధాప్యానికి దారి తీసే ఫ్రీ రాడికల్స్ నుంచి మనలని రక్షిస్తుంది. చెడు కొలెస్ట్రాల్ ని తగ్గిస్తుంది. శరీరం నుంచి అదనపు కొవ్వుని తొలగించడంలో సహాయపడుతుంది.
- రక్తాన్ని పలుచన చేసి రక్తం గడ్డకట్టకుండా నిరోధిస్తుంది. శరీరంలోని ఆక్సిజన్ స్థాయిలను మెరుగుపరిచి రక్తప్రసరణకి ఎటువంటి హాని కలగకుండా చూస్తుంది.
- జీర్ణ ప్రక్రియ సజావుగా జరిగేలా చూస్తుంది. ప్రతిరోజు ఒక దానిమ్మ పండు తింటే మలబద్ధకం సమస్య దరి చేరదు.
- దానిమ్మలోని గుణాలు ధమనుల్లో ఆక్సీకరణ ఒత్తిడిని, వాపును తగ్గిస్తాయి. దానిమ్మ రక్తపోటుని అదుపులో ఉంచుతుంది. గుండె పోటు, స్ట్రోక్ రాకుండా అడ్డుకుంటుంది.
- అధిక రక్తపోటుతో బాధపడే వాళ్ళు కనీసం మూడు నెలల పాటు ప్రతి రోజు మూడు దానిమ్మ పండ్లు తింటే చాలా మంచిదని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. కార్డియో వాస్కులర్ డిసీజ్ బారిన పడకుండా కాపాడుతుంది.
- రక్తహీనత సమస్య ఉన్న వాళ్ళు మందులు వాడే ముందు రోజూ దానిమ్మను తిని చూడటం ఉత్తమం. ఎందుకంటే దానిమ్మ ఎర్ర రక్తకణాల సంఖ్యను పెంచుతుంది.
- దానిమ్మ పండులోనే కాదు తొక్కల్లో కూడా విటమిన్ ఏ, సి, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, విటమిన్ బి6 పోషకాలు ఉన్నాయి. అందుకే దానిమ్మ గింజలు తిన్నతర్వాత తొక్కలు పడేయకుండా వాటిని ఎండబెట్టి పొడి చేసుకుని పెట్టుకోండి.
- కీళ్ల నొప్పులతో బాధపడే వాళ్ళు దానిమ్మ తొక్కలు ఎండబెట్టుకుని చేసుకున్న పొడిని నీళ్ళలో వేసి మరిగించి తాగితే మంచిది.
- దానిమ్మ తొక్కల పొడిని వేడి నీళ్ళలో కలిపి పేస్ట్ లా చేసుకుని ముఖానికి రాసుకుంటే మొటిమల సమస్యను అధిగమించవచ్చు.

సినిమా

నాటు నాటు ప్రజల పాట

\- రామ్‌చరణ్

లాస్ ఏంజిల్స్‌లో ఇటీవల జరిగిన 95వ ఆస్కార్ అవార్డు ప్రదానోత్సవంలో 'ఆర్ఆర్ఆర్' సినిమాలోని 'నాటు నాటు' పాటకు బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగంలో సంగీతదర్శకుడు కీరవాణి, రచయిత చంద్రబోస్ ఆస్కార్ అవార్డులను అందుకున్న విషయం తెలిసిందే. ఈ అవార్డు వేడుక కోసం లాస్ ఏంజిల్స్ వెళ్లిన దర్శకుడు రాజమౌళి, ఆయన సతీమణి, కాస్ట్యూమ్ డిజైనర్ రమా రాజమౌళి, తనయుడు కార్తికేయ, సంగీత దర్శకుడు కీరవాణి, గాయకుడు కాలభైరవ, నటుడు శ్రీ సింహా తదితరులు శుక్రవారం హైదరాబాద్ చేరుకున్నారు. కాగా ఆస్కార్ అవార్డు సాధించడం గురించి రాజమౌళిని స్పందించమని విలేకర్లు అడగ్గా.. ఆయన 'జైహింద్' అన్నారు. ఇక ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు లాస్ ఏంజిల్స్ నుంచి శుక్రవారం ఢిల్లీ చేరుకున్నారు రామ్‌చరణ్. 'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డు రావడం గురించి స్పందిస్తూ– ''భారతీయ అభిమానులందరూ 'ఆర్ఆర్ఆర్'ను ఆదరించారు. 'నాటు నాటు' పాటను సూపర్ హిట్ చేశారు. 'నాటు నాటు' పాట మాది కాదు.. ప్రజల పాట. ప్రేక్షకుల అభిమానమే ఆస్కార్‌కి దారి వేసింది, అవార్డు వరించేలా చేసింది. వారితో పాటు కీరవాణి, చంద్రబోస్, రాజమౌళిగార్లకి కూడా థ్యాంక్స్ చెబుతున్నాను'' అని పేర్కొన్నారు రామ్‌చరణ్.



● రామ్‌చరణ్

తప్పుగా అర్థం చేసుకున్నారు: కాలభైరవ

ఆస్కార్ వేదికపై 'నాటు నాటు' పాటను పాడినందుకు ఆనందంగా ఉందంటూ ఓ నోట్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు కాలభైరవ. ''ఆస్కార్ వేదికపై 'నాటు నాటు' పాటను ప్రదర్శించినందుకు గర్వపడుతున్నాను. నాకు ఈ విలువైన క్షణాలు దక్కడానికి రాజమౌళి బాబా, నాన్న (కీరవాణి), కొరియోగ్రాఫర్ ప్రేమ్‌రక్షిత్ మాస్టర్, కార్తికేయ అన్న, అమ్మ, పెద్దమ్మ... ఇలా మరి కొందరు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కారణమయ్యారు. యూఎస్ టీమ్ కూడా హెల్ప్ చేసింది. వీరి సహకారం, ప్రోత్సాహం లేకపోతే ఆస్కార్ వేదికపై నా ప్రదర్శన వీలయ్యేది కాదు'' అని ఆ నోట్‌లో చెప్పు కొచ్చారు కాలభైరవ. కాగా ఎన్టీఆర్, రామ్‌చరణ్‌ల పేర్లను కాలభైరవ ప్రస్తావించకపోవడంతో ఈ ఇద్దరి హీరోల అభిమానులు, కొందరు నెటిజన్లు తప్పుబడుతూ కామెంట్స్ చేశారు. దీంతో ఈ విషయంపై సోషల్ మీడియా వేదికగా కాలభైరవ స్పందించారు. ''ఆర్ఆర్ఆర్' సినిమా, ఇందులోని 'నాటు నాటు' పాట సక్సెస్‌కు తారక్ అన్న, చరణ్ అన్న ముఖ్యులు. అందులో సందేహం లేదు. అయితే నేను ఆస్కార్ వేదికపై నా ప్రదర్శనకు సంబంధించిన విషయం గురించి మాత్రమే ఆ నోట్‌లో ప్రస్తావించాను. అది తప్పుగా అర్థమైనట్లుంది. అయినప్పటికీ నా మాటలను క్షమించమని అడుగుతున్నాను'' అని కాలభైరవ పేర్కొన్నారు.



● కాలభైరవ

ఆస్కార్ వేదికపై షాక్ అయ్యా: గునీత్ మోంగా

'ది ఎలిఫెంట్ విస్పరర్స్'కు డాక్యుమెంటరీ షార్ట్ సబ్జెక్ట్ విభాగంలో ఆస్కార్ అవార్డు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ డాక్యుమెంటరీ నిర్మాత గునీత్ మోంగా శుక్రవారం ముంబై చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. మామూలుగా ఆస్కార్ అవార్డు అందుకున్నవారు తమ యాక్సెప్టెన్సీ స్పీచ్‌ను 45 సెకన్లలో పూర్తి చేయాలి. 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' దర్శకురాలు కార్తీకి అన్ని సెకన్లలోనే పూర్తి చేశారు. కానీ నిర్మాత గునీత్ మోంగా కాస్త ఎక్కువ టైమ్ తీసుకుని మాట్లాడుతుండగా స్పీచ్ ఆపాలన్నట్లుగా వెనకనుంచి మ్యూజిక్ ప్లే చేశారు ఆస్కార్ నిర్వాహకులు. అలాగని నిర్వాహకులు ఈ 45 సెకన్ల నియమంలో కఠినంగా ఏమీ లేరు. బెస్ట్ యానిమేటెడ్ షార్ట్ ఫిల్మ్ విభాగంలో ఆస్కార్ అవార్డు గెల్చుకున్న చార్లీ మాక్సే, మ్యాథ్యూ ఫ్రాండ్‌లు 45 సెకన్ల కన్నా ఎక్కువగా మాట్లాడినా, నిర్వాహకులు అభ్యంతరం వ్యక్తం చేయలేదు. ఈ విషయంపై గునీత్ మోంగా స్పందించారు. ''ఇండియాకు తొలి ఆస్కార్ అవార్డును సాధించామనే గొప్ప విషయం గురించి చాలా మాట్లాడాలనుకున్నాను. కానీ నా స్పీచ్‌ను కట్ చేశారు. షాక్ అయ్యాను. ఇండియా తరఫున నేను మాట్లాడే అవకాశాన్ని నా నుంచి ఎవరో లాగేసుకున్నట్లుగా అనిపించింది. నేను మళ్లీ ఆస్కార్‌కు వెళతాను. అప్పుడు తప్పకుండా నా గొంతు మళ్లీ వినిపిస్తాను'' అని పేర్కొన్నారు గునీత్.



● గునీత్ మోంగా

ఆర్ఆర్ఆర్... నెంబర్ 3

భారతీయ చిత్రాల్లో అత్యధిక గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించిన జాబితాలో 'ఆర్ఆర్ఆర్' మూడోస్థానంలో నిలిచింది. ఇదివరకు ఈ స్థానంలో 'కేజీఎఫ్: చాప్టర్ 2' ఉండేది. తొలుత అత్యధిక గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించిన ఇండియన్ చిత్రాల జాబితాలో వరుసగా 'దంగల్' (దాదాపు రూ. 1900 కోట్లు), 'బాహుబలి: ది కన్‌క్లూజన్'(రూ. 1800 కోట్లు), 'కేజీఎఫ్: చాప్టర్ 2' (రూ. 1230 కోట్లు), 'ఆర్ఆర్ఆర్' (దాదాపు రూ. 1150 కోట్లు), 'పఠాన్' (రూ. 1050 కోట్లు.. ఇంకా ప్రదర్శితమవుతోంది) ఉన్నాయి. అయితే గత ఏడాది అక్టోబరులో జపాన్‌లో విడుదలైన 'ఆర్ఆర్ఆర్' ఇప్పటికీ ప్రదర్శితమవుతోంది. జపాన్ బాక్సాఫీస్ వద్ద 'ఆర్ఆర్ఆర్' ఇప్పటివరకు రూ. 80 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. అలాగే 'ఆస్కార్' ప్రచారంలో భాగంగా అమెరికాలో ఈ నెల 3న, తెలుగు రాష్ట్రాల్లో ఈ నెల 10న 'ఆర్ఆర్ఆర్'ను రీ రిలీజ్ చేశారు. దీంతో మరికొన్ని కలెక్షన్స్ వచ్చాయి. ఈ వసూళ్లు మొత్తాన్ని కలిపితే 'కేజీఎఫ్: చాప్టర్ 2' గ్రాస్ కలెక్షన్స్‌ను 'ఆర్ఆర్ఆర్' దాటిందని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు.

అందుకే విశ్వక్ డైరెక్షన్ మానేయాలి

\- ఎన్టీఆర్



● కరాటే రాజు, ఎన్టీఆర్, విశ్వక్‌సేన్, నివేదా పేతురాజ్

''సినిమా పట్ల విశ్వక్ సేన్‌కి ఎంతో పిచ్చి ఉంది. ఆ పిచ్చి తగ్గిపోకూడదు. ఇలాంటివాళ్లను ప్రోత్సహిస్తేనే పరిశ్రమ ఇంకా ముందుకెళుతుంది. 'దాస్ కా ధమ్కీ' హిట్ అవ్వాలి'' అని హీరో ఎన్టీఆర్ అన్నారు. విశ్వక్ సేన్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'దాస్ కా ధమ్కీ'. నివేదా పేతురాజ్ హీరోయిన్. కరాటే రాజు (విశ్వక్ సేన్ తండ్రి) నిర్మించిన 'దాస్ కా ధమ్కీ' ఈ నెల 22న విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో ఎన్టీఆర్ మాట్లాడుతూ– ''ఒకే చట్రంలో ఇరుక్కుపోతున్నానని చాలా కాలం తర్వాత రియలైజ్ అయిన నేను, మీరు (అభిమానులు) కాలర్ ఎత్తుకునే సినిమాలు చేస్తానని మాట ఇచ్చాను.. ఆ మాట అన్నప్పుడే నటుడిగా నేను మళ్లీ పుట్టాను. వైవిధ్యమైన నటన కోసం నేను తాపత్రయపడుతున్నాను కాబట్టే మిమ్మల్ని కాలర్ ఎగరేసుకునేలా చేస్తున్నానని అనుకుంటున్నాను. విశ్వక్ కూడా ఒకే తరహా పాత్రల నుంచి బయటికొచ్చి, కొత్తగా చేస్తున్నాడు. 'దాస్ కా ధమ్కీ' బ్లాక్ బస్టర్ అవ్వాలి. ఆ తర్వాత తను దర్శకత్వం మానేయాలి. ఎందుకంటే కొత్త యువ దర్శకులకు నీలాంటి వాళ్లు అవకాశాలు ఇవ్వాలి. ప్రస్తుతం తెలుగు సినిమా ప్రపంచ చిత్ర పటంలో ఆల్‌టైమ్ టాప్‌లో ఉంది. 'ఆర్ఆర్ఆర్' ఈ రోజు ప్రపంచ చిత్రపటంలో నిలబడిందంటే, ఆస్కార్ అవార్డుని సొంతం చేసుకుందంటే దానికి మా యూనిట్‌తో పాటు యావత్ తెలుగు, భారతదేశ చిత్రపరిశ్రమ, ప్రేక్షక దేవుళ్లు కూడా కారణం. కీరవాణి, చంద్రబోస్‌గార్లు ఆస్కార్ అవార్డు తీసుకుంటున్నప్పుడు నాకు వాళ్లు కనిపించలేదు.. ఇద్దరు భారతీయులు కనిపించారు.. ఇద్దరు తెలుగువాళ్లు కనిపించారు'' అన్నారు. విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''ఇండియాలో బెస్ట్ యాక్టర్ ఎవరంటే ఎన్టీఆర్ అన్న అని నేను ఎప్పుడో చెప్పాను. నా సినిమాని ప్రోత్సహించేందుకు ఎన్టీఆర్ వచ్చారు. ఆయన రాకతో నా సినిమా బ్లాక్‌బస్టర్ స్టార్ట్ అయిపోయినట్లే'' అన్నారు. ''ఫలక్‌నుమా దాస్' తీసినప్పుడు మా అబ్బాయి విశ్వక్ ఎవరికీ తెలియదు. ఎంతో పబ్లిసిటీ చేసి, సినిమా విడుదలకి ముందే స్టార్‌డమ్ తెచ్చుకున్నాడు. 'దాస్ కా ధమ్కీ' కోసం 15 నెలలు కష్టపడ్డాడు'' అన్నారు కరాటే రాజు.


మా నమ్మకం నిజమైంది



● హర్షిత్ రెడ్డి, హన్షిత

''ప్రతి ఊరిలో, ప్రతి కుటుంబంలో జరిగే కథే 'బలగం'. ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చుతుందని వేణు కథ చెప్పినప్పుడే నమ్మాం. అది నిజమైంది'' అని నిర్మాతలు హర్షిత్ రెడ్డి, హన్షిత ('దిల్' రాజు కుమార్తె) అన్నారు. ప్రియదర్శి, కావ్యా కల్యాణ్‌రామ్ జంటగా వేణు ఎల్దండి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'బలగం'. 'దిల్' రాజు సారథ్యంలో శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మించిన ఈ సినిమా ఈ నెల 3న విడుదలైంది. ఈ సందర్భంగా హన్షిత మాట్లాడుతూ– ''శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై నాన్నగారు ('దిల్' రాజు) తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో భారీ సినిమాలు నిర్మిస్తున్నారు. ప్రతిభ ఉన్నవారిని ప్రోత్సహించడంతో పాటు ప్రయోగాత్మక, వైవిధ్యమైన కథలను చిన్న సినిమాల ద్వారా ప్రేక్షకులకు అందివ్వాలనే 'దిల్' రాజు ప్రొడక్షన్ బ్యానర్‌ని స్థాపించాం. 'బలగం'ని ప్రేక్షకులతో కలిసి థియేటర్‌లో చూశాక నాన్నగారు 'మీరు ఎన్ని సినిమాలు తీసినా 'బలగం' మాత్రం గుర్తుండిపోతుంది' అని అభినందించారు'' అన్నారు. హర్షిత్ రెడ్డి మాట్లాడుతూ– ''బలగం' చిత్రానికి రోజు రోజుకు వసూళ్లు పెరుగుతున్నాయి. మా తొలి సినిమాకే ఇంత మంచి పేరు రావడం హ్యాపీ. ప్రస్తుతం యష్ మాస్టర్ హీరోగా శశి అనే కొత్త డైరెక్టర్‌తో ఓ సినిమా నిర్మిస్తున్నాం'' అన్నారు.


బికిలి అంటే..?



● విజయ్ ఆంటోని

'వీళ్లే బికిలి బికిలి బిలి బిలి.. బికిలి బికిలి బిలి బిలి...' అంటూ పాడారు విజయ్ ఆంటోని. 2016లో విజయ్ ఆంటోని హీరోగా రూపొందిన తమిళ చిత్రం 'పిచ్చైక్కారన్' తెలుగులో 'బిచ్చగాడు'గా విడుదలై ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. శశి దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. ఇప్పుడు 'బిచ్చగాడు'కు సీక్వెల్‌గా 'బిచ్చగాడు 2' వస్తోంది. విజయ్ ఆంటోని నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పొరేషన్ పతాకంపై ఫాతిమా విజయ్ ఆంటోని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఈ వేసవిలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'బికిలి' అనే పాట మ్యూజిక్ వీడియోను రిలీజ్ చేశారు. భాష్యశ్రీ రాసిన ఈ పాటకు మ్యూజిక్ కంపోజింగ్, సింగర్ విజయ్ ఆంటోనీయే కావడం విశేషం. ఇక పేదవాళ్ల పేదరికాన్ని ఉపయోగించుకుని తన ధనబలంతో వారిని బానిసలుగా చేసి, డబ్బు ఉందన్న అహంకారంతో తిరిగే వాళ్లకు తాను బికిలీ అని పేరు పెట్టినట్లు విజయ్ ఆంటోని పేర్కొన్నారు.

కామెడీ.. యాక్షన్



● యోగేశ్వర్, సుమన్, జీవీవీ గిరి

యోగేశ్వర్, అతిథి జంటగా సాయి శివాజీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పరారీ'. గాలి ప్రత్యూష సమర్పణలో జీవీవీ గిరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్‌లో కాంగ్రెస్ లీడర్ అంజన్ కుమార్ యాదవ్, నటుడు సుమన్, నిర్మాత ప్రసన్న కుమార్ ట్రైలర్‌ను విడుదల చేశారు. డైరెక్టర్ చంద్ర మహేష్, నిర్మాతలు టి. రామసత్యనారాయణ, ప్రతాని రామకృష్ణ గౌడ్ థియేట్రికల్ ప్రోమోను, నటి కవిత సాంగ్ ప్రోమోను రిలీజ్ చేశారు. ''మంచి కథ, కథనాలతో నిర్మించిన మా 'పరారీ' అందర్నీ మెప్పిస్తుంది'' అన్నారు జీవీవీ గిరి. ఈ చిత్రానికి సంగీతం: మహిత్ నారాయణ్.

వైరానికి సిద్ధం



● మోనాల్, ప్రణమ్

నటుడు దేవరాజ్ తనయుడు ప్రణమ్ దేవరాజ్ హీరోగా నటించిన చిత్రం 'వైరం'. సాయి శివం జంపాన దర్శకత్వం వహించిన ఈ మూవీలో మోనాల్ హీరోయిన్. యువాన్స్ నాయుడు సమర్పణలో తెలుగు, కన్నడ భాషల్లో జె. మల్లికార్జున నిర్మించారు. నటులు దేవరాజ్, చంద్ర దేవరాజ్ శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి బ్యానర్ లోగోను లాంచ్ చేయగా, నటులు బెనర్జీ, కాశీ విశ్వనాథ్ 'వైరం' టీజర్‌ను విడుదల చేశారు. దేవరాజ్ మాట్లాడుతూ– ''తెలుగు ప్రేక్షకులు నన్నెంతో ఆదరించారు. హీరోగా వస్తున్న నా కుమారుడు ప్రణమ్‌ని కూడా ఆదరించాలి'' అన్నారు. ''త్వరలో మా సినిమాని విడుదల చేస్తాం'' అన్నారు జె. మల్లికార్జున. ''ఈ సినిమా బాగా వచ్చింది'' అన్నారు సాయి శివన్ జంపాన. ఈ చిత్రానికి సహనిర్మాత: శీలం త్రివిక్రమ్ రావు, అరిపిరాల కళ్యాణ్ శాస్త్రి, సంగీతం: మహతి స్వరసాగర్, కెమెరా: సామల భాస్కర్.